రాజమహేంద్రవరం లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థిగా రుద్రరాజు 7



కోనసీమ జిల్లా రావులపాలెంలో చంద్రబాబు సభ ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న కూటమి నాయకులు

రేపటి నుంచి చంద్రబాబు ప్రజాగళం

- రేపు రావులపాలెం, రామచంద్రపురంలలో సభలు
- 4న గోపాలపురం, కొవ్వూరు నియోజకవర్గాల్లో పర్యటన
- అనంతరం పశ్చిమకు పయనం - వేడెక్కిన రాజకీయం

రావులపాలెం/అమలాపురం/నల్లజర్ల/రాజమహేంద్రవరం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ప్రజాగళం పేరుతో ఎన్నికల ప్రచారం సాగిస్తున్న టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు బుధవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా నుంచి గోదావరి జిల్లాలో సార్వత్రిక ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టనున్నారు. ఆయన కొత్తపేట, రామచంద్రపురం నియోజకవర్గాల్లో పర్యటించనున్నారు. ఈ మేరకు కోనసీమ ముఖద్వారమైన రావులపాలెంలో చంద్రబాబు పర్యటన ఏర్పాట్లను కొత్తపేట అసెంబ్లీ కూటమి అభ్యర్థి బండారు సత్యానందరావు, జోన్-2 ఇన్‌చార్జి సుజయ కృష్ణరంగారావు, పొలిట్‌బ్యూరో సభ్యుడు రెడ్డి సుబ్రహ్మణ్యం, అమలాపురం లోక్‌సభ అభ్యర్థి గంటి హరీశ్‌మాధుర్, జనసేన కొత్తపేట ఇన్‌చార్జి బండారు శ్రీనివాస్, బీజేపీ పదాధికారి తమలంపూడి రామకృష్ణారెడ్డి, తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ సోమవారం పరిశీలించారు. రావులపాలెం కెనాల్ రోడ్డులో బహిరంగ సభా స్థలి ప్రదేశం, మల్లాయిదొడ్డిలో హెలిపాడ్ ఏర్పాటు, అక్కడకు సమీపంలో ఉన్న ఓ ఫంక్షన్ హాలులో ముఖ్య నేతలతో మాట్లాడేందుకు వీలుగా ఉన్న కల్యాణ మండపాన్ని పరిశీలించారు. రావులపాలెం సభ అనంతరం రామచంద్రపురం పర్యటనకు చంద్రబాబు హెలికాప్టర్‌లో వెళతారని సమాచారం.రామచంద్రపురం నియోజకవర్గ పరిధిలోని ద్రాక్షారామలో బుధవారం సాయంత్రం జరిగే బహిరంగ సభలో పాల్గొంటారు. మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు రెండు నియోజకవర్గాల్లో చంద్రబాబు పర్యటన కొనసాగుతుందని టీడీపీ నేతలు పేర్కొంటున్నారు. రాత్రికి రామచంద్రపురంలో బస చేసే అవకాశం ఉంది.ఈ మేరకు నాయకులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు, గోపాలపురం ఎస్సీ రిజర్వుడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో 4వ తేదీ గురువారం పర్యటిస్తారు.గోపాలపురం నియోజకవర్గం నల్లజర్లలో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నారు. ఈ మేరకు సోమవారం స్థల సేకరణ పనిలో టీడీపీ నాయకులు నిమగ్నమయ్యారు. నల్లజర్లలో లేదంటే గోపాలపురం,దేవరపల్లి మండలాల్లో బహిరంగ ఏర్పాటు చేసే దిశగా ప్రయత్నాలు చేస్తున్నారు. కొవ్వూ రులోనూ ఏర్పాట్లు చేస్తున్నారు. పశ్చిమ గోదావరి జిల్లా తణుకు,పాలకొల్లు నియోజకవర్గాల్లో 5వ తేదీన పర్యటించనున్నారు. ఇప్పటికే జనసేన అధినేత పవన్ కల్యాణ్ కాకినాడ జిల్లా పరిధిలోని పిఠాపురంలో పర్యటించిన సంగతి తెలిసిందే. ఆయన రాకతో రాజకీయం వేడెక్కింది. టీడీపీ అధినేత చంద్రబాబు కూడా రానుండడంతో కూటమిలో మరింత జోష్ పెరగనుంది.ఈ నెల 5 నుంచి రాజ మహేంద్రవరం ఎంపీ అభ్యర్థి పురందేశ్వరి బరిలో దిగనున్నారు.

పిఠాపురం.. ఇక నా స్వస్థలం



కార్యక్రమంలో మాట్లాడుతున్న పవన్‌కల్యాణ్

- ఏదో ఒక గ్రామంలో ఇల్లు తీసుకుంటా
- నియోజకవర్గ సర్వతోముఖాభివృద్ధి నా బాధ్యత
- ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటా
- జనసేన అధినేత పవన్‌కల్యాణ్
- జనసేనలో భారీగా చేరికలు

పిఠాపురం, ఏప్రిల్ 1: 'పిఠాపురాన్ని నా స్వస్థలం చేసుకోవడానికే ఇక్కడకు వచ్చా. నియోజకవర్గంలోని 54 గ్రామాల్లో ఏదో ఒకచోట ఇల్లు తీసుకుని ఉంటా. నన్ను ఒక్కసారి గెలిపించమని భగవంతుడిని కోరితే పిఠాపురం పిలిచింది. మనం భారీ మెజార్టీతో గెలవబోతున్నామ'ని జనసేన అధినేత పవన్ కల్యాణ్ అన్నారు. పిఠాపురం మండలం కుమారపురంలోని గోకులం గ్రాండ్‌లో సోమవారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో పిఠాపురం నియోజకవర్గానికి చెందిన ప్రముఖ వైద్యులు, న్యాయవాదులు, వివిధ వర్గాల ప్రముఖులు, వైసీపీకి చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సొసైటీల ఛైర్మన్లు, నాయకులు జనసేన పార్టీలో చేరారు. వారందరికీ పవన్ జనసేన కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పిఠాపురం నియోజకవర్గంలోని అందరినీ వ్యక్తిగతంగా కలవాలన్న ఆశ తనకు ఉన్నప్పటికీ భద్రతాపరమైన కారణాలతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని పవన్ తెలిపారు. ప్రత్యర్థుల పన్నాగాలు గమనిస్తూ మనమంతా ముందుకు సాగాల్సిన అవసరం ఉందని చెప్పారు. భద్రతాపరమైన ప్రొటోకాల్ పాటిస్తూ రోజుకి 200 మందిని కలిసి వారితో ఫొటోలు తీసుకుంటానని తెలిపారు. శ్రీపాదశ్రీవల్లభుడు, పురుహూతికా అమ్మవారు, బషీర్ బీబీ (బంగారు పాప) దర్గా, ఆంధ్రా బాప్టిస్టు చర్చి సాక్షిగా ప్రజలందరికీ ఎల్లప్పుడు అందుబాటులో ఉంటూ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. తాను భగవంతుడినీ ఏదీ కావాలని కోరుకోనని, అయితే సినిమాలు వరుసగా ఫ్లాప్ అవుతున్న సమయంలో నల్గొండకు చెందిన అభిమాని వచ్చి ఒక్క హిట్ ఇవ్వు అన్నా అని అడిగాడు. అప్పుడు ఒక్క హిట్ ఇవ్వమని, భీమవరంలో ఓడిపోయిన తర్వాత గెలుపు ఇవ్వమని భగవంతుడిని కోరానని, ఆ మేరకు తనను పిఠాపురం పిలిచిందని చెప్పారు. నియోజకవర్గంలో ఏ ప్రాంతంలో ఉండాలన్నదీ త్వరలో నిర్ణయించుకుంటాని, పురుహూతికా అమ్మవారి ఆశీస్సులతో ఇక్కడే ఏదో ఒక గ్రామంలో ఇల్లు తీసుకుని ఉంటానన్నారు. పగిలే గాజు గ్లాసుకు పదును ఎక్కువన్నారు. అందరినీ ప్రత్యేకించి కలుస్తానని, ప్రతి ఒక్కరి సమస్యలనూ తెలుసుకుంటానని తెలిపారు. పార్టీలో కష్టపడిన ప్రతి ఒక్కరికీ గుర్తింపు ఉంటుందని చెప్పారు. అందుకు కాకినాడ ఎంపీ అభ్యర్థి ఉదయ్ శ్రీనివాస్ నిదర్శనమన్నారు. వచ్చే 25 సంవత్సరాల్లో కొత్తతరం నాయకులు ముందుకు రావాలని కోరారు. ఇప్పటి నుంచీ నిలబడితేనే రేపటి రోజున నాయకులు తయారవుతారని తెలిపారు. జనసేన పార్టీ నియోజకవర్గ స్థాయి నుంచి మండల, గ్రామస్థాయి వరకు నాయకులను తయారు చేస్తుందని చెప్పారు. కాకినాడ ఎంపీ అభ్యర్థి ఉదయ్ శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ ఉపాధ్యక్షుడు బి.మహేందరరెడ్డి, ఎన్నికల సమన్వయ కమిటీ సభ్యులు వేములపాటి అజయకుమార్, పి.హరిప్రసాద్, మర్రెడ్డి శ్రీనివాస్, కె.శరత్, కార్యక్రమాల నిర్వహణ కమిటీ ఛైర్మన్ కల్యాణం శివ శ్రీనివాస్, తెలంగాణా ఇన్‌చార్జి ఎన్.శంకరగౌడ్, మాజీ ఎంపీపీ కురుమళ్ల రాంబాబు తదితరులు పాల్గొన్నారు. కాగా పిఠాపురం నియోజకవర్గం, ఇతర ప్రాంతాల ప్రముఖులు పవన్ సమక్షంలో జనసేనలో చేరారు. వారిలో ప్రముఖ వైద్యురాలు డాక్టర్ వరలక్ష్మి, న్యాయవాదులు సూరవరపు వెంకటేశ్వరరావు, త్రినాథ్, వెంకటరమణ, అరుణ్‌బాబు, కన్నా ఆశ్రయ్ ఫౌండేషన్ ఛైర్‌పర్సన్ గండి శకుంతలాదేవి, వంతల నందీశ్వరి, సూరవరపు సురేష్, మారిశెట్టి బుజ్జి, ఊటా సత్యనారాయణ, ఎలుబండి ప్రభు, డాక్టర్ ఆర్.మోహనరావు, కోడిగుడ్డి రాజేష్, గారపాటి శ్రీనివాసరావు, బస్వా ప్రసాద్, మేరుగు జగదీష్, ఎండీ జాఫర్ షరీఫ్, షేక్ ఖాదీర్, నజీర్, అబ్దుల్ ఖయూమ్, లోకారెడ్డి రామకృష్ణ, బొజ్జా లోవరాజు, యా పాటి అరుణ్‌బాబు, కుక్కా శ్రీను ఉన్నారు.





పిఠాపురంలో జనసేన పార్టీలో చేరిన ప్రముఖ వైద్యురాలు డాక్టర్ వరలక్ష్మి... కన్నా ఆశ్రయ్ ఫౌండేషన్ ఛైర్‌పర్సన్ గండి శకుంతలాదేవి

నేటి పర్యటన ఇలా..

సోమవారం మధ్యాహ్నం 1.40 గంటలకు గొల్లప్రోలులోని హెలిపాడ్‌కు చేరుకున్న పవన్‌కల్యాణ్ సాయంత్రం 5.15 గంటలకు గొల్లప్రోలు హెలిపాడ్ నుంచి హైదరాబాదుకు హెలికాప్టర్‌లో పయనమయ్యారు. ఆయన తిరిగి మంగళవారం నియోజకవర్గానికి వస్తారు. ఉదయం 9 గంటలకు హెలిపాడ్ నుంచి బయలుదేరి పిఠాపురంలోని ఏబీసీ (ఆంధ్ర బాప్టిస్ట్ చర్చ్)కు, తర్వాత కొత్తపల్లి మండలం పొన్నాడలోని బషీర్‌బీబీ దర్గా (బంగారు పాప)లకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొంటారు. తర్వాత యు కొత్తపల్లి మండలం కొత్తపల్లిలోని సురక్ష ప్యాలెస్ ఫంక్షన్ హాలులో మహిళలతో సమావేశంలో పాల్గొంటారు. అక్కడ నుంచి పిఠాపురం చేరుకుని వివిధ జంక్షన్లలో పర్యటిస్తారు. ఆయా కార్యక్రమాల్లో ప్రజలు పెద్దఎత్తున పాల్గొనాలని జనసేన కార్యాలయం ఒక ప్రకటనలో కోరింది.

జనసేనలో చేరిన మండలి బుద్ధప్రసాద్

పిఠాపురం, ఏప్రిల్ 1: జనసేన పార్టీలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రముఖులు చేరేందుకు పిఠాపురం వేదిక అయ్యింది. పిఠాపురం మండలం కుమారపురం గ్రామంలోని గోకులం గ్రాండ్ హోటల్‌లో సోమవారం జరిగిన కార్యక్రమంలో అవనిగడ్డ మాజీ ఎమ్మెల్యే, అసెంబ్లీ మాజీ డిప్యూటీ స్పీకర్ మండలి బుద్ధప్రసాద్, పాలకొండ నియోజకవర్గానికి చెందిన నిమ్మక జయకృష్ణ, రైల్వేకోడూరు నియోజకవర్గం సర్పంచ్ శ్రీధర్ పవన్ కల్యాణ్ సమక్షంలో జనసేన తీర్థం పుచ్చుకున్నారు. వారందరికీ పవన్ సాదర స్వాగతం పలికారు. పార్టీలో చేరిన అనంతరం మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ అవనిగడ్డ నియోజకవర్గం నుంచి పోటీకి నిలవమని పవన్ తనను కోరగా చంద్రబాబు మద్దతు ఇచ్చారన్నారు. జగన్ ఐదేళ్ల పాలనలో ఏపీలో జరగని అరాచకం లేదని మండిపడ్డారు. వేల కోట్ల దోపిడీ జరిగిందని ఆరోపించారు. తెలుగు భాషాభివృద్ధికి తాను చేసిన కృషిని పవన్ ఎన్నోసార్లు మెచ్చుకున్నారని ఆయన గుర్తు చేసుకున్నారు. శ్రీకాకుళం జిల్లా పాలకొండ నియోజకవర్గానికి చెందిన నిమ్మక జయకృష్ణ మాట్లాడుతూ తనకు సీటు వస్తుందని ఆశిస్తున్నట్టు చెప్పారు. పాలకొండలో వైసీపీ నాయకుల అక్రమాలు దారుణంగా ఉన్నాయని ఆయన తీవ్ర స్థాయిలో విమర్శించారు.



ఇదేంది సార్ : రాజమండ్రి రామచంద్రరావు పేటలో సగం వేసి వదిలేసిన రోడ్

వైచీఫ్ ట్రిక్స్!

- ఎక్కడికక్కడ హడావుడిగా పనులు
- సీసీ రోడ్లూ వెలుస్తున్నాయ్..
- గోతులు పూడుకుపోతున్నాయి..
- డ్రైనేజీలు కట్టేస్తున్నారు..
- శిలాఫలకాలు పెట్టేస్తున్నారు
- ఐదేళ్లు గాలికి.. ఇప్పుడు సీన్‌లోకి
- నవ్వుకుంటున్న జనం

ఎన్నికల వేళ..అభివృద్ధి గుర్తొచ్చిందా..!?

ఐదేళ్లు జనం పడిన బాధలు అన్నీ ఇన్నీ కావు.. ఏ రోడ్డు చూసినా గోతులే.. ఇదేం ప్రభుత్వం రా బాబూ.. అసలు ఏమీ పట్టదు.. ఈ రోడ్డు ఎప్పుడు వేయిస్తుందో అని ప్రతి ఒక్కరూ ఎదురుచూసిన వారే.. అయినా గుర్తుకు రాలేదు.. నాయకులకు వినతులిచ్చినా పట్టించుకోలేదు.. అధికారులకు చెప్పినా స్పందన లేదు.. ఈ ప్రభుత్వం సంగతేంటో చూద్దాం అనుకున్నారంతా.. అయితే సీఎం జగన్ ఊరుకుంటాడా.. మసిపూసి మారేడుకాయ చేసేందుకు సిద్ధమైపోయాడు.. ఎన్నికల వేళ ఎక్కడపడితే అక్కడ రోడ్లు వేస్తున్నారు.. డ్రైనేజీలు కడుతున్నారు.. అడిగినవాడికి అడిగిన పనిచేస్తున్నారు.. ఎక్కడ చూసినా హడావుడి చేస్తున్నారు.. అయితే జనం నమ్ముతారా..!! ఎన్నికల వేళ వై..చీఫ్ ట్రిక్స్ అని నవ్వుతున్నారు.. 2019లో మా నమ్మకం నువ్వే జగన్ అన్నవారే.. ప్రస్తుతం 2024 ఎన్నికల వేళ నిన్ను నమ్మలేం జగన్ అంటున్నారు..

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

అధికారం చేతబట్టి నాలుగేళ్ల పది నెలలు గడిచింది. ఇంకా రెండు నెలల్లో పీఠం ఖాళీ చేయాల్సిన పరిస్థితి... ఇన్నాళ్లు లేని బాధ్యత, పట్టని ప్రజల తిప్పలు ఎన్నికల కోడ్ కూయడానికి కొద్ది గంటల ముందు.. పాలనాకాలం చివర్లో వైసీపీ నేతలకు ఠక్కున గుర్తొచ్చేశాయి.ఏది పడితే అది ప్రారంభం, ఎక్కడ పడితే అక్కడ శంకుస్థాపనలు, శిలాఫలకాలు,రిబ్బను 'కటింగ్'లు.. ఈ తంతు చూస్తున్న జనం విస్తుపోతున్నారు. ఐదేళ్లు ఏమైపోయారు.. హం గామాకు అభివృద్ధి పేరు తగిలించి మళ్లీ 'గాలి' చూపించి ఓట్లు లాక్కుందామనే దురాశలో భాగమేనని స్పష్టం చేస్తున్నారు. నగరాలు, గ్రామాల్లో జరుగుతున్న హడావుడి చూస్తుంటే వారి ఆరోపణల్లో నిజం లేకపోలేదని పిస్తోంది. ఎన్నికల ప్రవర్తనా నియమావళి 16న సాయంత్రం ప్రకటించే అవకాశం ఉందని ఒకరోజు ముందు తెలిసింది. దీంతో ఒక్కసారిగా వైసీపీ నేతల్లో ఉత్సాహం తన్నుకొచ్చింది. ఏది పడితే అది చేసేస్తామంటూ హడావుడి మొదలు పెట్టారు. 15వ తేదీ అర్ధరాత్రి కూడా శంకుస్థాపనలు చేసి, చీకట్లోనే శిలాఫలకాల రిబ్బన్లను కత్తిరించారు. ఇక ఎన్నికల కోడ్ వచ్చిన తర్వాత మరింత తెలివి ప్రదర్శిస్తూ కుళాయిలు, వీధిలైట్లు వేయడం చేస్తున్నారు. ఎన్నికల వేళ అభివృద్ధి కలరింగ్ ఇస్తున్నారు. ఓట్ల కోసం కొత్త నాటకానికి తెరలేపారు. గమనించిన ప్రజలు ఇన్నాళ్లు లేనిది ఇప్పుడు గుర్తొచ్చిందా అంటూ ముక్కున వేలేసుకుంటున్నారు..పెద్ద పనులు పక్కన పెట్టేసి చిన్న పనులతో మమ అనిపిస్తున్నారనే ఆరోపణలున్నాయి.

కోడ్ ముందు గుర్తొచ్చాయి..

ఎన్నికల కోడ్ వచ్చిన రెండు రోజుల ముందు నుంచీ అధికారులకు, సిబ్బందికి కంటిపై కునుకు లేదు. ఏదోలా ఎక్కడో అక్కడ శిలాఫలకాలు వేయాలంటూ వైసీపీ నాయకుల ఒత్తిడితో ఎడాపెడా ఎస్టిమేట్లు వేసేసి వాయువేగంతో అనుమతి ఇచ్చేసి ప్రారంభోత్సవాలు పూర్తి చేసేశారు. జిల్లాలోని రాజమహేంద్రవరం కార్పొరేషన్, నిడదవోలు, కొవ్వూరు మునిసిపాలిటీలు మిగతా పంచాయతీల్లో అభివృద్ధి పేరుతో విధ్వంసమే సృష్టిస్తున్నారు. ఎక్కడ చూసినా హంగామాతో మభ్యపెడుతున్నారు. జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో నాలుగేళ్ల కిందట శిలాఫలకాలు వేసి మర్చిపోయారు. మళ్లీ అదే పనులకు అక్కడే కొత్తగా శిలాఫలకాలు వేస్తూ వెర్రి వేయి విధాలు అనే నానుడిని నిజం చేశారు. చాలా ప్రాంతాల్లో కుళాయిలు, వీధిలైట్లు వేస్తూ వాటిని ప్రచారానికి వాడుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. పోనీ వీటన్నిటికీ రాష్ట్ర ప్రభుత్వం నిధులు ఇచ్చిందా? అంటే అదీ లేదు. స్థానిక సంస్థల సాధారణ నిధుల నుంచి ఖర్చు చేస్తున్నారు.

ఎన్నికల వేళయ్యిందనీ..

రాజమహేంద్రవరం రూరల్ పరిధిలోని కాటన్ బ్యారేజ్ గత నాలుగన్నరేళ్లుగా గోతులతో నిండే ఉంది. ఎవరైనా వెళితే అయ్యబాబోయ్ అనే పరిస్థితి. ఇటీవల రెండు నెలల కిందట హడావుడిగా పనులు పూర్తిచేశారు. మరి ఇన్నాళ్లు ఏమైపోయారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇక హుకుంపేట - బొమ్మూరు రహదారిపై నెల కిందట వెళ్లామంటే నరకమే.. ఎక్కడ గొయ్యిందో.. ఎక్కడ రోడ్డుందో తెలియని పరిస్థితి.. ఆ రోడ్డుపై ఎంతో మంది తీవ్ర గాయాలపాలయ్యారు. అయినా పట్టించుకోలేదు.. గత రెండు నెలలుగా ఆ రోడ్డు పనులు సాగుతున్నాయి. మరీ ఇన్నాళ్లు ఏమైపోయారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. సీతానగరం - కోరుకొండ రోడ్డు పరిస్థితి ఇంతే. రోడ్డును నాలుగేళ్లుగా నిర్మిస్తూనే ఉన్నారు.ఇటీవల పనులు నాణ్యతగా లేకపోవడంతో ప్రజలు అడ్డుకున్నారు. నేటికీ హడావుడిగా సాగుతూనే ఉన్నాయి. కొవ్వూరు మునిసి పాలిటీలో సీసీ రోడ్ల కోసం హడావుడిగా టెండర్లు పిలిచి వర్క్ ఆర్డర్లు కాంట్రాక్టర్ల చేతిలో పెట్టారు. కానీ బిల్లులు వస్తాయన్న నమ్మకం లేక పనులు ప్రారంభం కాలేదు. అనపర్తిలో రూ.2-5 లక్షల విలువ చేసే చిన్న చిన్న రోడ్లు, సీసీ రోడ్లు వేసి శిలాఫలకాలు పెట్టుకున్నారు. నాలుగేళ్ల కిందట శిలాఫలకాలు వేసిన చోటే మళ్లీ వేసి కొత్త సంస్కృతికి తెరతీశారు. దాదాపుగా ప్రతి వీధిలో గత రెండు నెలలుగా శిలాఫలకం ఏర్పాటు చేస్తున్నారు. ఒక్కోచోట శిలాఫలకం కోసమే పని చేశారా!? అనే చందంగా ఉండడంతో జనం నవ్విపోతున్నారు. కొత్తూరు, దుప్పలపూడి జగనన్న కాలనీల్లో తమ ఇష్టానుసారం వీధులకు వైసీపీ నాయకుల పేర్లు పెట్టి ప్రచార యావను చాటుకున్నారు.రాజానగరం నియోజకవర్గంలో వెలుగుబంద, కానవరంలో గృహాలకు కేటాయించిన భూములకు సంబంధించి కోడ్ వచ్చే ముందు రోజు రాత్రి రైతుల ఖాతాల్లో హడావుడిగా నగదు జమ చేశారు.కలవచర్లలో పారిశ్రామికవాడ పరిస్థితీ అంతే.కోడ్ ముందు రోజు హడావుడిగా శిలాఫలకం వేసి రిబ్బను కత్తిరించారు. అక్కడ పనులు ఎప్పుడు మొదలవుతాయో మరి. నిడదవోలు గణపతి థియేటర్ దగ్గర ఐ లవ్ నిడదవోలు అంటూ రుడా నిధులతో ఆధు నికీకరణ పనులు చేపట్టారు. కోడ్ వచ్చే హడావుడిలో పనులు పూర్తి కాకుండానే ప్రారంభోత్సవం చేసి ఆపై గాలికొదిలేశారు. గణేశ్‌చౌక్ సెంటర్ నుంచి ఓవర్ బ్రిడ్జి వరకూ ఫుట్‌పాత్‌ల నిర్మాణానికి శిలాఫలకం వేసేసి వది లేశారు.ఇలా అక్కడా ఇక్కడా అని ఏముంది.. అన్ని చోట్లా నాలుగన్నరేళ్లుగా లేనిది నేడు శిలాఫలకాలు దర్శనమిస్తున్నాయి.. ఎన్నికల వేళ అధికార వైసీపీ.. చీఫ్ ట్రిక్స్ బయటపడుతున్నాయి.



చివరిలో ఇలా : రాజమహేంద్రవరం జాంపేట నుంచి దానవాయిపేటకు ఇటీవలే వేసిన సిమెంట్ రోడ్డు



వంతెనకు డిజైన్ లేదు.. టెండర్ లేదు..
అయినా వెలిసిందీ!
నిడదవోలులో ఇదీ తీరు..

నిడదవోలు, ఏప్రిల్ 1 : ఆలూ లేదు.. చూలూ లేదు కొడుకు పేరు సోమలింగం అన్న నానుడి వైసీపీ ప్రజా ప్రతినిధులకు అచ్చుగుద్దినట్టు సరిపోతుంది. ఎందుకంటే ఎన్నికల వేళ పనులు అధికారికంగా ఖరారు కాకపోయినా.. ఎక్కడికక్కడ శిలాఫలకాలు మాత్రం దర్శనమిస్తున్నాయి.ఈ సంఘటనే అందుకు ఉదాహరణ.. నిడదవోలు పట్టణంలోని చిన కాశీరేవు వద్ద అప్పారావు ఛానల్‌పై మార్టేరు-ప్రక్కిలంక రహ దారికి అనుసంధానంగా వేసిన గడ్డర్ బ్రిడ్జి కొట్టుకు పోయింది. కొత్త బ్రిడ్జికి ప్రతిపాదనలు వెళ్లాయి. డిజైన్ ఖరారు కాకుండానే శిలాఫలకం వేసి శంకుస్థాపన చేయడం విచిత్రానికి పరాకాష్టగా నిలుస్తోంది. నాలు గేళ్లుగా గుర్తుకురాని ఆ వంతెన ఎన్నికల వేళ హఠాత్తుగా గుర్తొచ్చేసింది.ఈ నెల 15వ తేదీన ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అట్టహాసంగా శంకుస్థాపన చేసేశారు. సుమారు రూ.4.65 కోట్ల అంచనాలతో పనులు ప్రారంభిస్తున్నట్టు శిలాఫలకం ఆవిష్కరించారు. అయితే అసలు తేడా ఇక్కడే ఉంది.వంతెన నిర్మాణానికి సంబంధించి నేటికి వంతెన డిజైన్ అధికారికంగా ఖరారు కాలేదు. టెండర్ దశకు వెళ్ళలేదు. అలాంటిది నిడదవోలు ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడు శంకుస్థాపన చేసేశారు. ఎమ్మెల్యే ప్రజలను మభ్యపెడుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ అధికారులు సైతం డిజైన్ ఖరారుకాకుండా టెండర్ దశకు వెళ్లని పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేయడంపై విస్తుపోతున్నారు. ఒకవేళ డిజైన్ ఖరారై టెండరు దశ పూర్తయితే నేటికీ పనులు ఎందుకు ప్రారంభం కాలేదంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

పించన్ల సొమ్మేది?

- ఇంకనూ బ్యాంకు ఖాతాలకు చేరని రూ.75 కోట్లు
- జిల్లాలో 2.45 లక్షల మంది లబ్ధిదారులు

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

అధికార వైసీపీ ప్రభుత్వం ఎన్నికల సమయంలో పింఛన్‌దార్లను ఇబ్బందుల పాలు చేస్తోంది. ఒకటవ తేదీన ఇవ్వవలసిన పింఛన్‌ను 3వ తేదీ నుంచి 8వ తేదీ వరకూ ఇస్తామని ప్రకటించిన సంగతి తెలిసిందే. కానీ ఇప్పటి వరకూ ప్రభుత్వం సొమ్ము రిలీజ్ చేయలేదు. జిల్లాలో 2.45 లక్షల మంది పింఛన్ లబ్ధిదారులు ఉన్నారు. పింఛనుదారులకు మొత్తం రూ.75 కోట్ల సొమ్ము పంపిణీ చేయాల్సి ఉంది. ఒకటో తేదీ వెళ్లినా సొమ్ము ఇంకా జమకాలేదు. 3వ తేదీ ఉదయానికి వచ్చే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.పింఛన్ సొమ్ము జిల్లాలోని సంబంధిత బ్యాంక్‌లకు జమకావలసి ఉంది.ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లా యంత్రాంగం సచివాలయ ఉద్యోగులతో ఎన్నికలయ్యే వరకూ పంపిణీ చేయించడానికి నిర్ణయించిన సంగతి తెలిసిందే. గ్రామ సెక్రటరీ కానీ, వెల్ఫేర్ అసిస్టెంట్‌కానీ బ్యాంక్‌కు వెళ్లి డబ్బు డ్రా చేయాలి.ఈ మేరకు ఆయా ఎంపీడీవోలు లెటర్లు ఇవ్వనున్నారు.ఒక్కో సచివాలయం పరిధిలో రూ.10 లక్షల వరకూ పించన్ల సొమ్ము ఉంటుంది. 2వ తేదీ మం గళవారం కూడా సొమ్మురాకపోతే మూడో తేదీ ఉదయం నుంచి పించన్ల పం పిణీ కష్టమే. ఒకవేళ మూడోతేదీన ప్రభుత్వం రిలీజ్ చేసినా ఆయా సచివాల యాల పరిధిలో ఉద్యోగులు బ్యాంక్‌ల నుంచి డ్రా చేయడానికి సమయం పడు తుంది. అందువల్ల 3న కూడా పించన్లు అందుతాయో లేదో చెప్పలేని పరిస్థితి ఏర్పడింది.

నేటి నుంచి ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం

రాజమహేంద్రవరం రూరల్ ఏప్రిల్ 1 : జిల్లాలో మంగళవారం నుంచి 6 మండలాల్లో 87 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తామని జేసీ తేజ్‌భరత్ తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో పౌర సరఫరాల, అనుబంధ శాఖల అధికారులతో రబీ సీజనులో ధాన్యం సేకరణపై సోమవారం సమీక్షించారు. ప్రస్తుత రబీ సీజనులో జిల్లాలో 3.20 లక్షల టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా నిర్దేశించాన్నారు. జిల్లాలో 229 ఆర్‌బీకేల ద్వారా మంగళవారం నుంచి ధాన్యం సేకరణ ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు కార్యాచరణ సిద్ధం చేశామన్నారు. తొలి దశలో చాగల్లు, దేవరపల్లి, కొవ్వూరు, తాళ్లపూడి, నిడదవోలు, రంగంపేట, మండలాల్లో 87 కొనుగోలు కేంద్రాల ద్వారా మంగళవారం నుంచి సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు.



ఓటుపై అవగాహన ర్యాలీ ప్రారంభిస్తున్న కలెక్టర్ మాధవీలత

ఓటుపై అవగాహనకు ర్యాలీ

రాజమహేంద్రవరం రూరల్ ఏప్రిల్ 1 : ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కె.మాధవీలత పిలుపునిచ్చారు. మే 13వ తేదీన జరగనున్న సార్వత్రిక ఎన్నికలను పురస్కరించుకుని ఓటర్లకు అవగాహన కల్పించే దిశగా రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి జేసీ తేజ్‌భరత్ ఏర్పాటు చేసిన బైక్ ర్యాలీని జిల్లా కలెక్టర్ మాధవీలత, ఎస్పీ పి.జగదీశ్ ప్రారంభించి మాట్లాడారు. జిల్లావ్యాప్తంగా 7 నియోజకవర్గాల్లో 16.50 లక్షల మంది ఓటర్లు ఉన్నారన్నారు. గత ఎన్నికల్లో పోలింగ్ శాతం పరిశీలిస్తే రూరల్‌లో ఎక్కువ అర్బన్‌లో తక్కువ శాతం పోలింగ్ నమోదైందన్నారు.గత ఎన్నికల్లో జిల్లాలో 76 శాతం పోలింగ్ నమోదు కాగా రూరల్‌లో 72 శాతం మాత్రమే పోలింగ్ నమోదైందని జేసీ తేజ్ భరత్ అన్నారు. ఓటరు నమోదు ప్రక్రియపై నిర్వహించిన బైక్ ర్యాలీలో బీయల్‌వోలు, రెవెన్యూ, సివిల్ సప్లై, పంచాయతీరాజ్, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



మాక్ పోలింగ్ తప్పనిసరి

సామర్లకోట, ఏప్రిల్ 1: గత ఎన్నికలతో పోలిస్తే ఈ దఫా ఎన్నికల నిబంధనల అమలులో కొన్ని మార్పులు తీసుకొచ్చారు. రానున్న సార్వత్రిక ఎన్నికలలో ప్రతీ పోలింగ్ కేంద్రంలోనూ పోలింగ్ ప్రారంభానికి గంటన్నర ముందుగా మాక్ పోలింగ్ నిర్వహించి పోలింగ్‌కు సన్నద్ధం చేయాలి. రీ పోలింగ్‌కు ఎక్కడా అవకాశం రాని రీతిలో పీవోలు అప్రమత్తంగా వ్యవహరించాలి. ఏమాత్రం విధుల్లో పొరపాట్లు జరిగినా సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తప్పవు. పోలింగ్ రోజున వీలైనంత వేగంగా పోలింగ్ జరిగేలా చర్యలు చేపట్టాలి. ఒక ఓటరు పోలింగ్ కేంద్రంలోకి వెళ్లి ఓటు వేసి తిరిగి వచ్చేందుకు 7 నిమిషాల సమయం పడుతుంది. దానిని దృష్టిలో ఉంచుకుని ఇతర పనులు పూర్తిచేయాలి. ప్రతీ పోలింగ్ కేంద్రంలోనూ 90 నిమిషాలకు ముందు తప్పనిసరిగా మాక్‌పోలింగ్ నిర్వహించాలని, అనంతరం ఈవీఎంలను డిలీట్ చేయాలని, వీవీ ప్యాట్‌లు ఖాళీ చేసి సీల్ చేయాలి. మాక్ పోలింగ్ జరగకపోతే పోలింగ్ రద్దయ్యే అవకాశం ఉంది. ఉదయం 5.45 గంటలకు మాక్ పోలింగ్ పూర్తి కావాలని ప్రతీ పోలింగ్ కేంద్రానికి పీవోతో పాటు నలుగురు సిబ్బందిని కేటాయించారు. ఎన్నికల విధులకు ప్రభుత్వ శాశ్వత ఉద్యోగులను మాత్రమే నియమిస్తారు. వలంటీర్లు, అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులకు అవకాశం ఎంతమాత్రం లేదు. ఎన్నికల నిర్వహణపై శిక్షణ మూడు విడతల్లో నిర్వహించాలి.

'సోషల్' ప్రచారానికి అనుమతి ఉండాల్సిందే





సామర్లకోట, ఏప్రిల్ 1: వాట్సాప్, ఫేస్‌బుక్ వంటి సోషల్ మీడియా ప్రచారానికి కూడా ముందస్తు అనుమతి పొందాల్సిందేనని ఎన్నికల కమిషన్ నుంచి ఉత్తర్వులు ఆర్వో అధికారులకు అందాయి. ఈ మేరకు ఆంధ్రజ్యోతి గురువారం రాత్రి సమాచారాన్ని సేకరించింది. ఈ-పేపర్స్, ఫేస్‌బుక్, వాట్సాప్, యూట్యూబ్, వికీపీడియా, వర్చువల్ గేమ్ వరల్డ్, ఎస్ఎంఎస్ వాయిస్ మెసేజ్, ఎఫ్ఎం ఛానెల్స్, ఐవీఆర్ కాల్స్, సినిమా హాల్స్ ప్రకటనలు, రేడియో, బహిరంగ ప్రదేశాలలో ప్రదర్శించే ఆడియో విజువల్స్ తదితరాలు మీడియా ఎలక్ట్రానిక్స్ పరిధిలోకి వస్తాయని అధికారులు తెలిపారు. అభ్యర్థులు ఎలక్ట్రానిక్ మీడియాలో ప్రకటనలకు ముందస్తు అనుమతులు పొందాలని స్పష్టం చేశారు. మీడియా సర్టిఫికేషన్ మోనిటరింగ్ కమిటీ దీనికి అనుమతులు ఇస్తుందని పేర్కొన్నారు. ముందస్తు ధ్రువీకరణ పత్రాలు పొందకుండా సోషల్ మీడియాలో ఎటువంటి ప్రచారం చేసినా ఎన్నికల నియమావళి ఉల్లంఘన కింద వస్తుందని స్పష్టం చేశారు. ఎన్నికల సంఘం దగ్గర నమోదైన రాజకీయ పార్టీలు కనీసం 3 రోజుల ముందుగా జిల్లా ఎన్నికల అధికారి కార్యాలయంలోని ఎంసీఎంసీ సెల్‌లో సంబంధిత అధికారికి ప్రీ సర్టిఫికేషన్ కోసం దరఖాస్తు సమర్పించాలి. నమోదు కాని రాజకీయ పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు 7 రోజుల ముందుగా దరఖాస్తు సమర్పించాలి. ప్రచారం చేయడానికి ప్రతిపాదించిన అంశం స్క్రిప్ట్ ఎలక్ట్రానిక్ ఫార్మెట్‌ను రెండు ప్రతులలో సమర్పించాలి. దరఖాస్తుతో పాటు ప్రకటన నిర్మాణ ఖర్చు రోజుకు ఎన్నిసార్లు ప్రచారం చేస్తున్నదీ ప్రతీ ప్రచారానికి ఎంత ఖర్చు తదితర వివరాలు సోషల్ మీడియా ప్రకటనలకు తయారీ ఖర్చు సంబంధిత సిబ్బందికి చెల్లిస్తున్న వేతనాలు తదితర అంశాల వివరాలు అందించాలి. పోటీలో ఉన్న అభ్యర్థి కానీ అభ్యర్థి ధ్రువీకరించిన వ్యక్తి గాని దరఖాస్తు సమర్పించాలి. ప్రకటనలలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి పూర్తిగా పాటించాలి. ప్రకటనలలో ఎటువంటి అభ్యంతరకర అంశాలు, పదాలు, వ్యాఖ్యలు ఉండరాదు. జాతి, మత, ప్రాంత, భాష, సామాజిక వర్గ విభేదాలు సృష్టించే విధంగా ఉండే అంశాలు గాని, వ్యక్తిగత దూషణలు గాని, భావోద్వేగాలు రెచ్చగొట్టే అంశాలు కానీ ఉండరాదు. పెయిడ్ న్యూస్, ఎన్నికల సమయంలో అభ్యర్థులు జారీ చేసే ప్రకటనల ఖరీదును సంబంధిత అభ్యర్థి వ్యయ ఖాతాలో జమ చేస్తారు. ప్రీ సర్టిఫికేషన్ లేకుండా ఎటువంటి ప్రకటనలను ప్రదర్శించే కేబుల్ నెట్ వర్క్‌ల ప్రతినిధులు నియమావళిని పాటించాల్సిందే. ప్రింట్ మీడియా ప్రకటనలకు కూడా అనుమతి తప్పనిసరి. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ప్రకారం ప్రచారం ముగిసిన తేదీ సాయంత్రం నుంచి పోలింగ్ రోజుకు మధ్య 48 గంటల సమయంలో కూడా అనుమతులు పొందాలని ఎన్నికల కమిషన్ ఆదేశాలలో స్పష్టం చేశారు.

క్షణంలో ఘోరం

ట్యాంకర్ పేలి ఇద్దరు దుర్మరణం



పేలిన ట్యాంకర్ ఇదే

గొల్లప్రోలు రూరల్, మార్చి 1: కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం దుర్గాడ శివారులోని కత్తిపూడి నుంచి రావికంపాడు వెళ్లే రోడ్డులో వెల్డింగ్ చేస్తుండగా ట్యాంకర్ పేలడంతో ఇద్దరు అక్కడికక్కడ మృతిచెందగా మరో ముగ్గురికి గాయాలయ్యాయి. శంఖవరం మండలం కత్తిపూడి గ్రామానికి చెందిన గాబు గంగాధర్ తన ఆయిల్ ట్యాంకర్‌ను మరమ్మతుల నిమిత్తం అదే గ్రామంలోని సత్యాదుర్గా ఆర్క్ వెల్డింగ్ ఇంజనీరింగ్ వర్క్స్‌కు ఇచ్చారు. గొల్లప్రోలు మండలం దుర్గాడ శివారులోని కత్తిపూడి నుంచి రావికంపాడు వెళ్లే రోడ్డులో ట్యాంకర్ వెనుక భాగంలో సోమవారం ఉదయం 9 గంటలు నుంచి వెల్డింగ్ పనులు ప్రారంభించారు. పోలవరం కాలువ పక్కనే పనులు నిర్వహిస్తున్న సమయంలో ఆయిల్ ట్యాంకర్ వెనుక భాగం పేలిపోయింది. ఆ పేలుడు తాకిడికి ట్యాంకర్ భాగాలు తగలడంతో శంఖవరం మండలం కత్తిపూడి గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ బూర సోమరాజు అలియాస్ శామ్యూల్ (39), వెల్డింగ్ వర్కర్ కొంచెర్ల ప్రభాకర్ (38) అక్కడికక్కడే మరణించారు. ప్రమాదంలో వెల్డింగ్ షాపు యజమాని నున్న లోవరాజు, మరో ఇద్దరు వ్యక్తులకు గాయాలయ్యాయి. సంఘటనా స్థలాన్ని ట్రైనీ డీఎస్పీ ప్రమోద్, గొల్లప్రోలు ఎస్ఐ బాలాజీలు పరిశీలించారు. శామ్యూల్ భార్య ప్రియాంక ఫిర్యాదు మేరకు గొల్లప్రోలు పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా శామ్యూల్‌కు భార్య, కుమార్తె సమీర, కుమారుడు వరుణ్, ప్రభాకర్‌కు భార్య చిన్నారి, పిల్లలు త్రినాథ్, తేజస్విని, చందు ఉన్నారు.





ప్రమాదంలో అక్కడికక్కడే మృతిచెందిన ప్రభాకర్, శామ్యూల్

కుటుంబాల్లో విషాదం

శంఖవరం, ఏప్రిల్ 1: గొల్లప్రోలు మండలం దుర్గాడ శివారులో జరిగిన ప్రమాదం కత్తిపూడిలో తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ ప్రమాదంలో గ్రామానికి చెందిన ఇద్దరు మృత్యువాత పడగా మరో ముగ్గురు గాయపడ్డారు. చనిపోయిన వారు ఇద్దరూ రోజు వారీ కూలి వస్తేనే జీవనం గడిపే పరిస్థితి. వెల్డింగ్ చేసే కొంజర్ల ప్రభాకర్‌కు (38) భార్య చిన్నారి, కుమారులు త్రినాథ్, చందు, కుమార్తె తేజస్విని ఉన్నారు. లారీ డ్రైవర్‌గా పనిచేసే బూరా సోమరాజు (39)కు భార్య ప్రియాంక, కుమార్తె సమీర, కుమారుడు వరుణ్ ఉన్నారు. ఈ ఇద్దరి సంపాదనతోనే ఆయా కుటుంబాలు నడుస్తున్నాయి. అప్పటివరకూ అందరితో కలిసి మెలిసి ఉండే వారిపై ఒకేసారి ఉప్పెనలా మృత్యువు దూసుకొచ్చిందని కుటుంబ సభ్యులు విలపిస్తున్నారు. వెల్డింగ్ షాపు యజమాని నున్న లోవరాజు తీవ్రంగా గాయపడ్డాడు. మరో ముగ్గురికి కళ్లల్లో ఆయిల్ పడడంతో స్థానిక ఆస్పత్రిలో చికిత్సనందించి మెరుగైన చికిత్స కోసం కాకినాడ తరలించారు.



ప్రభాకర్



శామ్యూల్

ఘనంగా ఆలయ పునర్నిర్మాణ వేడుకలు

- రత్నగిరిపై ప్రత్యేక పూజలు, నివేదన
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

అన్నవరం, ఏప్రిల్ 4: ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి ఆలయ పునర్నిర్మాణ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. వేకువజామున 4 గంటలకు మూలవరులను సుప్రభాత సేవతో మేల్కొలిపి అభ్యంగన స్నానమాచరింపచేశారు. అనంతరం విశేష పూజలు నిర్వహించారు. విశేష పదార్థాలను నివేదించి భక్తులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం నాటి ఆలయ పునర్నిర్మాణంలో భాగస్వాములైన పండితులను దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ, ఈవో రామచంద్ర మోహన్ సత్కరించారు. ఈ సందర్భంగా నాటి అనుభవాలను పండితులు వివరించారు. దేవదాయ కమిషనర్ సత్యనారాయణ మాట్లాడుతూ ఆలయ పునర్నిర్మాణంలో అడిషనల్ కమిషనర్ రామచంద్రమోహన్ పాత్ర అత్యంత కీలకమని అన్నారు. ఆలయాన్ని పునర్నిర్మించాలని 12 ఏళ్ల క్రితం నివేదిక ఇచ్చినా ఏ అధికారి సాహసించలేకపోయారని పండితులను శృంగేరీ పీఠానికి తీసుకెళ్లి వారి సూచనలతో ఏడాది వ్యవధిలోనే పూర్తిచేయడం అభినందనీయమని అన్నారు. పుష్కరకాలం తర్వాత మరలా అన్నవరం దేవస్థానానికి రావడం ఇప్పుడు బంగారు ధ్వజస్తంభం ఏర్పాటు, జాతీయరహదారిపై నమూనాలయం నిర్మాణం పూర్తి ఆయన చేతుల మీదుగా జరగడం పూర్వ జన్మ సుకృతమని అన్నారు. ఈ సందర్భంగా దేవదాయ కమిషనర్ ఈవోను సత్కరించారు. సత్కార గ్రహీత రామచంద్రమోహన్ మాట్లాడుతూ తన బాధ్యతను మాత్రమే నిర్వహించానని సిబ్బంది అందరి సహకారంతో ఆలయ పునర్నిర్మాణం పూర్తి చేయగలిగానని అన్నారు. అనంతరం ఆయన సత్యదేవుడిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శిథిలావస్థకు చేరిన వెండి ధ్వజ స్తంభాన్ని పరిశీలించి ఇంజనీరింగ్ అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ రమేష్‌బాబు, పీఆర్వో కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.



పండితులను సత్కరించిన అధికారులు

విద్యార్థులతో వెళుతున్న ఆటో బోల్తా

పలువురికి గాయాలు



గాయపడిన విద్యార్థులు

సామర్లకోట, ఏప్రిల్ 1: సామర్లకోట పట్టణ శివారు బ్రౌన్‌పేట వద్ద గల వైఆర్ఎల్ డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థినులు వెళుతున్న ఆటో విస్తరణ శిక్షణా కేంద్రం సమీపంలో బోల్తా పడింది. ఆటోలో ప్రయాణిస్తున్న నలుగురు విద్యార్థినులు తీవ్రంగా గాయపడ్డారు. పెద్దాపురం మండలం ఆర్‌బీ. కొత్తూరు, రాయభూపాలపట్నం, పెద్దాపురం ప్రాంతాలకు చెందిన ఏడుగురు విద్యార్థినులు ఒకే ఆటోలో కళాశాల నుంచి ఇంటికి తిరుగు ప్రయాణం కాగా సోమవారం సాయంత్రం ఎదురుగా వస్తున్న బైక్‌ను తప్పించే ప్రయత్నంలో ఆటో డ్రైవర్ ఆకస్మికంగా బ్రేకులు వేయడంతో ఒక్కసారిగా రెండు పల్టీలు కొట్టింది. ఆటోలో ప్రయాణిస్తున్న విద్యార్థులు రోడ్డుపై చిందరవందరగా పడిపోయారు. పలువురికి గాయాలయ్యాయి. స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించి ప్రాథమిక వైద్యం అందించారు. వారిలో ఒక విద్యార్థినికి తలపై గాయం కావడంతో ఏడీబీ రోడ్డులో ఉన్న మెడికవర్ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. సామర్లకోట ఎస్ఐ మౌనిక క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించేందుకు చర్యలు తీసుకున్నారు. కేసు సామర్లకోట పోలీసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దివ్యాంగురాలిపై అత్యాచార యత్నం

ఆత్రేయపురం, ఏప్రిల్ 1: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలంలో ఓ దివ్యాంగురాలిపై సోమవారం ఓ యువకుడు అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... తల్లిదండ్రులు కూలిపనికి వెళ్లగా దివ్యాంగురాలు ఇంట్లో ఒంటరిగా ఉంది. దీనిని గమనించిన అదే ప్రాంతానికి చెందిన అంజి అనే యువకుడు ఇంట్లోకి ప్రవేశించి దివ్యాంగురాలిపై అత్యాచారయత్నానికి ఒడిగట్టాడు. ఆమె గట్టిగా కేకలు వేయడంతో ఆ యువకుడు పరారయ్యాడు. సాయంత్రం ఇంటికి వచ్చిన తల్లిదండ్రులకు ఆమె బోరున విలపించి విషయాన్ని చెప్పింది. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ శ్రీనివాస్ చెప్పారు.

మావోయిస్టుల కరపత్రాలు కలకలం





ఎటపాక, ఏప్రిల్ 1: భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్ట్) పేరుతో సోమవారం కూనవరం- భద్రాచలం రోడ్‌లోని గౌరిదేవిపేట- గన్నవరం గ్రామాల మధ్యలో రహదారిపై మావోయిస్టు కరపత్రాలు వెలిశాయి ఈ కరపత్రాలు చర్ల- శబరి ఏరియా కమిటీ మావోయిస్టుల పేరుతో ప్రత్యక్షమయ్యాయి. రహదారిపై పక్కన ఉన్న వృక్షాలపై కరపత్రాలను అంటించారు. ఇందులో దగాకోరు పార్లమెంట్ ఎన్నికలను బహిష్కరించాలని, కార్పొరేట్ కంపెనీల మైనింగ్స్, ప్లాంట్లు, రోడ్లు, డ్యామ్‌లు ప్రాజెక్టులను నిలిపి వేయాలని పేర్కొన్నారు. ఆదివాసీల స్వయం ప్రతిపత్తికి, చట్టాలకు భంగం కలిగించే పోలీస్ క్యాంపులు, ఉద్యమాలను అణిచివేసే పారా మిలటరీ, స్పెషల్ బలగాలను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. మూడు రోజుల వ్యవధిలో ఎటపాక మండలంలో రెండో సారి మావోల కరపత్రాలు కనిపించడం పోలీసులకు సవాలుగా మారుతోంది. గత శనివారం కనాయిగూడెం- తూర్పుబాక మధ్యలో, అలాగే చెన్నంపేట- సీతంపేట గ్రామాల మధ్యలో కరపత్రాలు కనిపించిన సంగతి తెలిసిందే.. కాగా మావోల కరపత్రాల సమాచారం తెలుసుకున్న పోలీసులు వెంటనే వాటిని స్వాధీనం చేసుకున్నారు

కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థులు..

కాకినాడకు పళ్లంరాజు, రాజమహేంద్రవరానికి రుద్రరాజు



కాకినాడసిటీ, ఏప్రిల్ 1: కాంగ్రెస్ పార్టీ కాకినాడ పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థిగా కేంద్ర మాజీ మంత్రి మల్లిపూడి మంగపతి పళ్లంరాజును కాంగ్రెస్ సీఈసీ ఖరారు చేసింది. కాకినాడ ఎంపీగా ఆయన ఏడోసారి బరిలో నిలువనున్నారు. తొలిసారి 1989లో పోటీ చేసి గెలుపొందారు. తర్వాత 1991లో మధ్యంతర ఎన్నికల్లో, 1998 మధ్యంతర ఎన్నికల్లో ఓటమి చెందారు.1999లో కాకినాడ అసెంబ్లీ అభ్యర్థిగా పోటీ చేసి పరాజయం చెందారు. 2004, 2009 ఎన్నికల్లో కాకినాడ పార్లమెంట్ నుంచి పోటీ చేసి గెలుపొందారు. 2006 నుంచి 2014 మధ్యకాలంలో కేంద్ర రక్షణశాఖ సహాయ మంత్రిగా, కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రిగా కొనసాగారు. 2014లో పోటీ చేసి ఓడిపోయారు. 2019 ఎన్నికలకు పళ్లంరాజు దూరంగా ఉండి ఆయన బాబాయ్ మల్లిపూడి రాంబాబును పోటీలో ఉంచారు.

రాజమహేంద్రవరం నుంచి గిడుగు రుద్రరాజు



రాజమహేంద్రవరం, ఏప్రిల్,1(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థిగా పీసీసీ మాజీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజును కాంగ్రెస్ అధిష్ఠానం ఖరారు చేసింది. అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం ప్రాంతానికి చెందిన రుద్రరాజు కాంగ్రెస్‌లో సీనియర్ నేత. కార్యకర్త స్థాయి నుంచి పీసీసీ అధ్యక్షుడిగా ఎదిగారు. వైఎస్ షర్మిలారెడ్డి పీసీసీ ప్రెసిడెంట్ అయ్యే వరకూ ఆయనే కొనసాగారు. ఈ ప్రాంతంలో చాలా మందికి ఆయన సుపరిచితుడు. ఇంతవరకూ టీడీపీ-జనసేన- బీజేపీ కూటమి, వైసీపీ మధ్యనే లోక్‌సభలో పోటీ ఉంటుందని అందరూ భావించారు. రుద్రరాజు ప్రకటనతో ఇప్పుడు త్రిముఖ పోరు ఖరారైంది.

డివైడర్‌ను ఢీకొని యువకుడి మృతి





కొవ్వూరు, ఏప్రిల్ 1: ప్రమాదవశాత్తు డివైడర్‌ను ఢీకొని యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చాగల్లుకు చెందిన షేక్ అబ్దుల్ కుతూష్(22) నల్లజర్లలో కళ్లజోళ్ల షాపులో పనిచేస్తున్నాడు. సోమవారం పని ముగించుకుని యాక్టివా బైక్‌పై రాజమహేంద్రవరం బయలుదేరాడు. జాతీయ రహదారిపై మార్గమధ్యంలో కొవ్వూరు ఏషియన్ పెయింట్స్ గొడౌన్ వద్దకు చేరుకునే సరికి ఎదురుగా ఉన్న డివైడర్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో కుతూష్ తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్టు కొవ్వూరు పట్టణ ఎస్ఐ జుబేర్ మహమ్మద్ తెలిపారు.

ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీల్లో రూ.లక్ష స్వాధీనం

అల్లవరం, ఏప్రిల్ 1: ఎన్నికల నేపథ్యంలో అల్లవరంలో ఎంపీడీవో టీఎస్ఎస్ కృష్ణమోహన్ ఆధ్వర్యంలో ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీలో రూ.1,00,400 స్వాధీనం చేసుకున్నారు. సోమేశ్వరం గ్రామానికి చెందిన రఘు మోటారు సైకిల్ బ్యాగులో నగదు తీసుకుని వెళ్తుండగా పట్టుకున్నారు. సరైన ఆధారాలు చూపకపోవడంతో ఆర్డీవో వద్దకు పంపించామని ఎంపీడీవో చెప్పారు. తనిఖీలో ఎంఈవో-2 ఎస్.ఏడుకొండలు, ఈవోపీఆర్డీ ఎస్వీవీ సత్యనారాయణ, కానిస్టేబుళ్లు శేఖర్‌బాబు, లక్ష్మి పాల్గొన్నారు.

ఇప్పటివరకు రూ.28.89 లక్షలు సీజ్

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లాలో ఇప్పటి వరకూ రూ.28,89,810 సీజ్ చేసినట్టు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా.కె.మాధవీలత తెలిపారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో సోమవారం ఎన్నికల నిర్బంధ వ్యవస్థ (ఈఎస్ఎంఎస్) పనితీరుపై సీజర్ నోడల్ ఏజెన్సీ అధికారులతో సమీక్షించారు. ఎన్నికల నేపథ్యంలో క్షేత్రస్థాయిలో సీజ్ చేసిన నగదు, మద్యం, మాదక ద్రవ్యాలు, విలువైన మెటల్, ఉచితాలు, ఇతర వస్తువుల డేటాను ఎప్పటికప్పుడు డిజిటలైజేషన్ చేయాలన్నారు. అధిక మొత్తాలపై నిఘా పెట్టాలన్నారు. రైల్వే, రోడ్డు రవాణా ద్వారా ఎక్కువ తరలింపులు ఉంటాయని తెలిపారు. తూర్పుగోదావరి ప్రధాన రహదారిలో ఉండడం వల్ల ఇతర ప్రాంతాలకు ఈ రోడ్డు మార్గాన ఎన్నికల్లో పంపిణీకి వస్తువుల రవాణా జరుగుతుంటుందని చెప్పారు. జిల్లాకు వచ్చే కంటైనర్ల రికార్డులు పరిశీలించి నివేదికలు ఇవ్వాలని ఆదేశించారు. రూ.50 వేలు కంటే ఎక్కువ నగదు దగ్గర ఉంటే ఆధారాలు చూపాలన్నారు. రాజమహేంద్రవరం అర్బన్‌లో ఇప్పటివరకూ రూ.2 లక్షలు, అనపర్తిలో రూ.1,27,860, నిడదవోలులో రూ.1.50,000, గోపాలపురంలో రూ.1,20,000, రాజమహేంద్రవరం అర్బన్‌లో రూ.90 వేలు సీజ్ చేశామన్నారు. జిల్లా సీజర్ నోడల్ అధికారి, జిల్లా ఆడిట్ అధికారి కేవీ వెంకటేశ్వరావు, సెబ్ అధికారులు పి.సోమశేఖర్, కె.జయ మౌనిక, ఎల్‌డీఎం డీవీ ప్రసాద్, ఐటీ అధికారులు శీలం వీర బాబు, బీవీ సుబ్బారెడ్డి, రాష్ట్ర జీఎస్టీ, రైల్వే అధికారులు పాల్గొన్నారు.

వలంటీర్ల తొలగింపు

ముమ్మిడివరం, ఏప్రిల్ 1: వైసీపీ నాయకులతో తిరుగుతూ వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటున్న ముమ్మిడివరం నగర పంచాయతీ సూరాయిచెరువు గ్రామ సచివాలయ పరిధిలోని వలంటీరును విధుల నుంచి తొలగిస్తున్నట్టు కమిషనర్ జి.వెంకటరామిరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. నగరం పంచాయతీ పరిధిలోని సూరాయిచెరువు గ్రామ సచివాలయం బాలయోగి కాల్వగట్టు క్లస్టర్-1 వలంటీరు విత్తనాల నాగార్జున గత నెల 30న ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో పితాని బాలకృష్ణ కర్నూలు జిల్లా గుత్తికొండలో సీఎం జగన్ సమక్షంలో వైసీపీ పార్టీలో చేరుతున్న సందర్భంగా వైసీపీ నాయకులతో కలిసి పాల్గొన్నాడు. ఈ మేరకు పత్రికల్లో కథనాలు వెలువడడంతో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వలంటీరు నాగార్జునను విధుల నుంచి తొలగిస్తూ కమిషనర్ ఉత్తర్వులిచ్చారు. ఆ వలంటీరు నుంచి మొబైల్, ఫోన్ సిమ్, బయోమెట్రిక్ డివైజ్‌లను స్వాధీనం చేసుకుని ఆ క్లస్టర్ పరిధిలో మరో వలంటీరు నియామకానికి చర్యలు చేపట్టాలని సచివాలయ కార్యదర్శికి కమిషనర్ ఆదేశాలిచ్చారు.

సఖినేటిపల్లి లంకలో..

అంతర్వేది, ఏప్రిల్ 1: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం సఖినేటిపల్లిలంక గ్రామానికి చెందిన సచివాలయం-1 ఎనిమిదో క్లస్టర్ వలంటీరు సేనాపతి పద్మాకర్ ఎన్నికల నియమావళిని ఉల్లంఘించినందుకు విధుల నుంచి తొలగించినట్టు ఎంపీడీవో బీవీ సత్యనారాయణ తెలిపారు. ఒక రాజకీయ పార్టీకి అనుకూలంగా పోస్టు చేసిన కారణంగా అతన్ని విధుల నుంచి తొలగించామని వలంటీర్లు ఎవరు ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించరాదని, అలాగే వారి వద్ద ఉన్న సెల్‌ఫోన్లను ఎంపీడీవో కార్యాలయంలో అందజేయాలన్నారు.

ఏపీపీఎస్సీలో అవకతవకలపై ఫిర్యాదు

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): ఏపీపీఎస్సీలో జరిగిన అవకతవకలపై రాజమహేంద్రవరం పార్లమెంటు నియోజకవర్గ టీఎన్ఎస్ఎఫ్ ప్రతినిధులు త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు. సీఎం జగన్, ఏపీపీఎస్సీ చైర్మన్ గౌతమ్ సవాంగ్, రామకృష్ణారెడ్డి నేతృత్వంలో కుంభకోణానికి తెరతీశారని ఫిర్యాదులో ఆరోపించారు. ఎంతోమంది నిరుద్యోగులను అన్యాయం చేసి పోస్టులను అమ్ముకున్నారని విమర్శించారు. కొన్ని పోస్టులను వారి అనుయాయులకు కట్టబెట్టుకున్నారన్నారు. ఫిర్యాదు అందజేసిన వారిలో టీఎన్ఎస్ఎఫ్ నాయకుడు సాయిదీపక్ తదితరులు ఉన్నారు.

3500 క్యూసెక్కుల విడుదల

మోతుగూడెం, ఏప్రిల్ 1: డొంకరాయి జలాశయం నుంచి 3500 క్యూసెక్కుల నీటిని శనివారం సాయంత్రం నుంచి విడుదల చేస్తున్నారు. గోదావరి డెల్టా రబీ పంటలకు మార్చి 10 నుంచి సీలేరు కాంప్లెక్సులోని పొల్లూరు జల విద్యుత్ కేంద్రం నుంచి 3500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. అయితే రబీ పంటలకు ఈ నీరు సరిపోకపోవడంతో ఇరిగేషన్ అధికారులు డొంకరాయి నుంచి అదనంగా మరో 3500 క్యూసెక్కుల నీటిని 5 రోజుల పాటు విడుదల చేయాలని జెన్‌కో ఉన్నతాధికారులను కోరారు. దీంతో డొంకరాయి జలాశయం నుంచి 3500 క్యూసెక్కుల నీటిని రబీకి విడుదల చేయాలని ఆదేశించడంతో శనివారం సాయంత్రం డొంకరాయి జలాశయం నుంచి 6,7 నెంబర్ గేట్ల ద్వారా 3500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సీలేరు కాంప్లెక్సు నుంచి విద్యుత్ ఉత్పత్తి ద్వారా 3500 క్యూసెక్కులు, విద్యుత్ ఉత్పత్తి లేకుండా జలాశయం నుంచి మరో 3500 క్యూసెక్కులతో కలిసి మొత్తం 7 వేల క్యూసెక్కుల నీరు రబీ పంటలకు సీలేరు నుంచి విడుదల అవుతుందని సీలేరు కాంప్లెక్సు సీఈ బి.శ్రీధర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సీలేరు కాంప్లెక్సు సూపరింటెండెంట్ ఇంజనీర్లు కేకేవీ ప్రశాంత్‌కుమార్, వెంకటేశ్వరరావు, ఈఈ బాలకృష్ణ, ఏడీఈ అప్పలనాయుడు, డీఈటీ వరప్రసాద్ పాల్గొన్నారు.

తూర్పుగోదావరి
• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి
• కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం
ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

ఏజెన్సీ సమాచారం

గ్రామాల్లో సర్వే నిర్వహించాలి



సమీక్ష నిర్వహిస్తున్న పీవో

రంపచోడవరం, ఏప్రిల్ 1: ఏజెన్సీలోని ప్రతి గ్రామంలో ఫీవర్స్ సర్వే నిర్వహించాలని ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే వైద్యాధికారులను ఆదేశించారు. తన కార్యాలయ చాంబరులో సోమవారం ఆయన వైద్యశాఖాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ఫీవర్ కేసులను గుర్తించి రక్త నమూనాలు సేకరించాలన్నారు. అలాగే మలేరియా దోమల నివారణకు స్ప్రేయింగ్ చేయించే కార్యక్రమాన్ని వైద్యాధికారులు పర్యవేక్షించాలన్నారు. ఈ సంవత్సరంలో నమోదైన మలేరియా కేసులపై పీహెచ్‌సీల వారీగా సమీక్షించారు. మలేరియా జ్వరాలు పెరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. బర్త్ వెయిటింగ్ హాల్లో చేరిన గర్భిణిలకు పోషక ఆహారం అందించాలన్నారు. పీహెచ్‌సీలలో ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు చేయాల్సిన ప్రణాళికలను సమర్పించాలన్నారు. కార్యక్రమంలో ఏడీఎంహెచ్‌వో జి.ప్రకాశం, ఏఎంవో నక్క వెంకటేశ్వరరావు, ఎంపీహెచ్‌వో పీటర్, వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీమన్నారాయణ సేవలు భేష్

రంపచోడవరం, ఏప్రిల్ 1: సబ్ కలెక్టరు కార్యాలయంలో పరిపాలనాధికారి పనిచేస్తూ పదవీ విరమణ పొందిన ఎం.శ్రీమన్నారాయణ సేవలు అభినందనీయమని ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే, సబ్ కలెక్టరు ఎస్.ప్రశాంత్‌కుమార్ అన్నారు. సోమవారం ఏపీ రెవెన్యూ అసోసియేషన్, గంగవరం మండల తహశీల్దారు సిబ్బంది ఆధ్వర్యంలో పదవి విరమణ వీడ్కోలు సభను ఏర్పాటు చేశారు. శ్రీమన్నారాయణను సత్కరించారు. డివిజనల్ సర్వే ఇన్‌స్పెక్టరు కె.దేవేంద్రుడు, రెవెన్యూ అసోసియేషన్ డివిజన్ కార్యదర్శి ఫయాజ్ బాషా, డీటీలు శ్రీధర్, వీరభద్రరావు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

జయహో బీసీ సభపై చర్చ



సమావేశంలో పాల్గొన్న నేతలు

ఎటపాక, ఏప్రిల్ 1: టీడీపీ తలపెట్టిన జయహో బీసీ సభను జయప్రదం చేయాలని వైస్ ఎంపీపీ దొంతు మంగేశ్వరరావు, మాజీ వైస్ ఎంపీపీ రావి మాధవరావు, సీనియర్ నాయకులు కిలారి వెంకటేశ్వరావు అన్నారు. నెల్లిపాకలో సోమవారం టీడీపీ కార్యకర్తలు, నాయకులు జయహో సభ నిర్వహణకు సంబంధించిన అంశాలపై చర్చించారు. ఈ నెల 5న గుండాల కాలనీ గ్రామంలో టీడీపీ ఆధ్వర్యంలో బీసీ జయహో సభను నిర్వహిస్తున్నారు. మండలంలోని బీసీ వర్గాలు ఈ సభకు తరలివచ్చి, విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎన్డీఏ కూటమి అభ్యర్థిని మిరియాల శిరీషాదేవీ హాజరవుతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా నాయకులు నలజాల శ్రీకాంత్ చౌదరి, పాటి చలపతిరావు, ఏలూరి వెంకన్న, మాచినేని రాజేష్, బొల్లా పుల్లయ్య పాల్గొన్నారు.

భవనాన్ని ప్రారంభించిన ఏఎస్పీ



భవనాన్ని ప్రారంభిస్తున్న ఏఎస్పీ జగదీష్, ఇతర అధికారులు

వై.రామవరం,ఏప్రిల్ 1: పోలీసులకు కల్పించే మౌలిక సదుపాయాల్లో భాగంగా స్థానిక పోలీస్‌స్టేషన్‌లో నిర్మించిన అతిథి భవనాన్ని రంపచోడవరం ఏఎస్పీ జగదీష్‌అడహల్లి సోమవారం ప్రారంభించారు. ఏఎస్పీ పూజాకార్యక్రమాల్లో పాల్గొన్న అనంతరం పోలీసులతో సమావేశమయ్యారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సిబ్బంది తీసుకోవల్సిన జాగ్రత్తలను, విధివిధానాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్ఐ సంతోష్‌కుమార్, సీఆర్పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ ఎంఎల్ నాయుడు, స్థానిక ఏఎస్ఐ రాంబాబు, సివిల్, సీఆర్పీఎఫ్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహనకు బుర్రకథ

వై.రామవరం,ఏప్రిల్ 1: ఓటు హక్కు అవగాహనపై సోమవారం వై.రామవరం వారపు సంతలో బుర్రకథ నిర్వహించారు. విభూతి కళా బృందం రాజమహేంద్రవరం ఆధ్వర్యంలో ప్రజలకు ఓటు హక్కు వినియోగంపై చైతన్యం కల్పించారు. డిప్యూటీ తహసీల్దార్ కె.సుధాకర్‌రావు మాట్లాడుతూ ఓటు ఎంతో ప్రాముఖ్యం కలదని 18 సంవత్సరాలు నిండిన యువతీయువకులు ఫారం 6 ద్వారా ఓటు హక్కు పొందాలన్నారు. కార్యక్రమంలో వీఆర్వో, వీఆర్ఏలు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

భానుడి భగభగ..జనం విలవిల



నిర్మానుష్యంగా ఉన్న రోడ్డు

మోతుగూడెం, ఏప్రిల్ 1: చింతూరు మండలం మోతుగూడెం పరిధిలో సోమవారం ఎండ బెంబేలెత్తించింది. ఎండ వేడిమికి తాళలేక ప్రజలు విలవిలలాడిపోతున్నారు. మోతుగూడెంలో 40 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. సోమవారం మోతుగూడెం ప్రధాన రహదారిపై జన సంచారం కనిపించలేదు. ఎండ తీవ్రతకు గిరిజనులు ఇక్కట్లు పడుతున్నారు. గొడుగులు లేకుండా బయటకు రాలేకపోతున్నారు.

నవోదయకు ఎంపికైన విద్యార్థులు







ఎటపాక, ఏప్రిల్ 1: నవోదయ ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి. 2024-25 విద్యా సంవత్సరానికి గాను మొత్తం ఎటకపాక మండలం నుంచి ఐదుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. పురుషోత్తపట్నం ప్రైమరీ పాఠశాలలో చదువుతున్న కోట యాక్షిత కొత్తకొండేపల్లి మండల ప్రజా పరిషత్ పాఠశాలలో చదువుతున్న రిహాన్సీ అలాగే నెల్లిపాక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న నక్కా వీక్షిత్ అభిరాం, గొల్లగట్టు మండ పరిషత్ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న ఎం.రిషివర్ధన్‌తో పాటు తోటపల్లిలోని శ్రీ ఆదిత్య పాఠశాలలో చదువుతున్న అభిరానందన్ నవోదయకు ఎంపికయ్యారు. ప్రభుత్వ పాఠశాలల నుంచి 4, ప్రైవేటు పాఠశాల నుంచి ఒకరు నవోదయకు ఎంపికయ్యారు. వారిని ఎంఈవో నీలి బాలరాజు అభినందించారు.

ఓటు హక్కు వినియోగించుకోండి

బిక్కవోలు, ఏప్రిల్ 1: ఓటు హక్కును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మండల డిప్యూటీ తహశిల్దార్ సత్యకృష్ణ పిలుపు నిచ్చారు. సోమవారం ఆయన రెవిన్యూ సిబ్బంది, స్థానిక ప్రజా కళాశాల, ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలసి గ్రామంలో ర్యాలీ జరిపి ఓటు హక్కుపై అందరికీ అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 14 గ్రామాల్లోను 55 పోలింగు కేంద్రాలను ఏర్పాటు చేసామన్నారు. అందు వల్ల ఓటు వున్న ప్రతి ఒక్కరూ తమ పోలింగ్ కేంద్రాలకు వెళ్లి ఓటును వినియోగించుకోవాలన్నారు.

ఇళ్ల పట్టాల పేరుతో ఫూల్స్ చేసిన జగన్



సమావేశంలో మాట్లాడుతున్న ఆదిరెడ్డి శ్రీనివాస్

- కానవరం భూముల్లో ఎకరాకు రూ.7 లక్షలు దోచేశారు
- పొలం కొనకుండానే పట్టాలు ఎలా ఇస్తారు..
- టీడీపీ-జనసేన-బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 1: ఇళ్ల పట్టాలను ప్రజలకు హడావుడిగా ఇచ్చి వారిని ఫూల్స్ చేసిన ఘనుడు సీఎం జగన్ అని టీడీపీ-జనసేన-బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్ ఆరోపించారు. రాజమహేంద్రవరం తిలక్‌రోడ్డులోని పార్టీ కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. క్యాలెండర్‌లో ఫూల్స్ డే ఏడాదికి ఒకసారి వస్తే జగన్ పాలనలో ప్రతిరోజూ ప్రజలను ఫూల్స్ చేశాడన్నారు. నివాసయోగ్యం కాని ఆవ భూములను కొనుగోలు చేసిన ప్రభుత్వం ఆటుపై ఎన్నికల కోడ్ వచ్చే సమయంలో హడావుడిగా కానవరం భూములను కొనుగోలు చేశారని దాని కోసం ఎంపీ భరత్‌రామ్ సీఎంవోకు వెళ్లి ఆగమేఘాలపై నిధులు మంజూరు చేయించారన్నారు. అయితే ఆ భూముల కొనుగోలులో ఎకరానికి రూ.7 లక్షలు రైతుల నుంచి దోపిడీ చేశారని ఆ డబ్బులు ఎవరి జేబిలోకి వెళ్లాయని ప్రశ్నించారు.కానవరానికి చెందిన సంగీత బ్రహ్మానందానికి చెందిన సర్వేనెంబరు 282లో ఎకరం 8సెంట్ల భూమిపై కోర్టులో కేసు ఉండగా ఆదే సర్వే నెంబరుతో జగనన్న ఇంటి పట్టా ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. కోడి పెదబూషికి చెందిన సీలింగ్ భూములు 50సెంట్లను కొనుగోలు చేయకుండా అతని భూమిలో ఇంటి పట్టాలు ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. ప్రజలను మోసం చేయడానికి జగన్ ప్రభుత్వం బోగస్ పట్టాలను ఇచ్చిందన్నారు. కూటమి అధికారంలోకి రాగానే పేదలందరికీ న్యాయం చేస్తామని, భూ అక్రమాలు, బోగస్ పట్టాల అక్రమాలపై సీబీఐ విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని చెప్పారు. కానవరానికి చెందిన రైతు సంగీతం రాజేష్ మాట్లాడుతూ కోర్టులో ఉన్న భూముకి పట్టాలు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. కోడి పెదబూషి మాట్లాడుతూ తన భూమి 50 సెంట్లను తీసుకున్న ప్రభుత్వం తనకు డబ్బులు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తంచేశారు. తమకు న్యాయం చేయాలని బాధితులు వేడుకున్నారు. సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్ కుమార్, జనసేన నగర ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణ, వై.శ్రీనివాస్, రెడ్డి మణి, క్షత్రియ బాలసుబ్రహ్మణ్యసింగ్, తాడేపల్లిగూడెం టీడీపీ పరిశీలకులు నక్కా చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ-జనసేన-బీజేపీ విజయం ఖాయం

- కూటమి రాజానగరం ఎమ్మెల్యే అభ్యర్థి బత్తుల



దివాన్‌చెరువులో పర్యటిస్తున్న బత్తుల బలరామకృష్ణ

దివాన్‌చెరువు, ఏప్రిల్ 1: సార్వత్రిక ఎన్నికల్లో జనసేన-టీడీపీ-బీజేపీ కూటమి విజయం సాధించడం ఖాయమని నియోజకవర్గ అభ్యర్థి బత్తుల బలరామకృష్ణ అన్నారు. దివాన్‌చెరువులోని శ్రీలక్ష్మీగణపతి, శ్రీకృష్ణుడు, వనువులమ్మ ఆలయాల్లో సోమవారం ఆయన ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం దివాన్‌చెరువులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బలరామకృష్ణ, ఆయన సతీమణి వెంకటలక్ష్మి ఇంటింటా తిరిగి ఓట్లు అభ్యర్థించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అమలు చేయబోయే పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గంగిశెట్టి చంటిబాబు, ఖండవిల్లి లక్ష్మి, వంక మల్లిబాబు, కందుల బాబూరాయుడు, దాసరి శ్రీను, జనసేన నాయకులు యర్రంశెట్టి శ్రీను, అక్కిరెడ్డి వేణుగోపాల్, పలివెల బులిరాజు పాల్గొన్నారు.

టీడీపీలోకి జగ్గంపేట మార్కెట్ కమిటీ చైర్మన్



గోకవరం, ఏప్రిల్ 1: జగ్గంపేట మార్కెట్ కమిటీ చైర్మన్, మాజీ ఎంపీపీ జనపరెడ్డి సుబ్బారావు (బాబు) వైసీపీని వీడి సోమవారం టీడీపీలో చేరారు. కొంతకాలంగా వైసీపీలో ఇమడలేక స్తబ్ధతగా ఉన్న బాబు మాజీ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఆధ్వర్యంలో గుంటూరు జిల్లా బాపట్లలో అధినేత చంద్రబాబుతో పార్టీ కండువాను వేయించుకున్నారు. ఈ సందర్భంగా జనపరెడ్డి బాబు మాట్లాడుతూ వైసీపీలో ఒంటెద్దు పోకడలు నచ్చక కొంతకాలం క్రితమే ఆ పార్టీకి రాజీనామా చేశానని, ముఖ్యమంత్రిగా, చంద్రబాబును, జ్యోతుల నెహ్రూను ఎమ్మెల్యేగాను గెలిపించుకునేందుకు కృషి చేస్తానన్నారు.

కూటమి అభ్యర్థిని గెలిపిస్తాం

కోరుకొండ, ఏప్రిల్ 1: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థి బత్తుల బలరామకృష్ణను అత్యధిక మెజార్టీతో గెలిపిస్తామని మండలంలోని బూరుగుపూడికి చెందిన కూటమి నాయకులు కంటే నాగ కేశవరావు, ఆడపా శ్రీనివాస్, కంటే గణపతి పేర్కొన్నారు. బాబు షూరిటీ-భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందించి సూపర్ సిక్స్ పథకాలు వివరించారు.

పింఛన్ల పంపిణీపై దిగజారుడు రాజకీయాలు

గోకవరం, ఏప్రిల్ 1: పింఛన్ల పంపిణీపై వైసీపీ నేతలు దిగజారుడు రాజకీయాలు మానుకోవాలని మాజీ జడ్పీటీసీ పాలూరి బోస్, టీడీపీ నాయకులు గాజింగం సత్తిబాబు, గునుపే భరత్ హితవు పలికారు. గోకవరంలోని టీడీపీ నాయకుడు సత్తిబాబు స్వగృహంలో సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ వలంటీర్లు పింఛన్లు పంపిణీలో పాల్గొనవద్దని ఎన్నికల కమిషన్ ఆదేశిస్తే.. చంద్రబాబు వల్లే పంపిణీ ఆగిపోయిందని తప్పుడు ప్రచారాలు చేయడం వైసీపీ నాయకుల దిగజారుడ రాజకీయాలకు నిదర్శనమన్నారు. ప్రభుత్వం వద్ద డబ్బులు లేకపోవడంతో పెన్షన్లు ఆలస్యంగా చెల్లించి ఆ నెపాన్ని టీడీపీపై వేసేందుకు వైసీపీ కుట్రలు చేస్తోందన్నారు. సమావేశంలో జక్కల చిన్ని, బొబ్బర్ల కామరాజు, బరుకు రాజు పాల్గొన్నారు.

అధిక దిగుబడినిచ్చే నూతన రకాలు సాగుచేయాలి



పంటను పరిశీలిస్తున్న నరసింహారావు తదితరులు

- ఏరువాక జిల్లా కోఆర్డినేటర్ నరసింహారావు

కోరుకొండ, ఏప్రిల్ 1: రైతులంతా సమష్టిగా నూతన రకాలను సాగు చేసుకుని తద్వారా నాణ్యమైన, స్థిరమైన దిగుబడులు పొందేందుకు కృషి చేయాలని ఏరువాక జిల్లా కేంద్రం కోఆర్డినేటర్ చల్లా వెంకట నరసింహారావు కోరారు. శాస్త్రవేత్తలు పి.అమ్మాజీ, హైమజ్యోతిలతో కలిసి ఆయన మండలంలోని కోటికేశవరంలో సోమవారం క్షేత్ర సందర్శనలు చేసి రైతులతో చర్చాగోష్ఠి నిర్వహించారు. వ్యవసాయ విశ్వవిద్యాలయానికి చెందిన అనేక రకాలు ఇటీవల కాలంలో క్షేత్రస్థాయి కమిటీ ద్వారా విడుదలయ్యాయని చెప్పారు. ముఖ్యంగా మార్టేరుకు చెందిన ఎంటీయూ 1271, నెల్లూరు రకం ఎన్ఎల్ఆర్ 3238, బాపట్ల రకం బీపీటీ 2846 వంటి రకాలు సాగు చేసుకోవా లన్నారు. ముఖ్యంగా గోదావరి జిల్లాల్లో మెట్ట ప్రాంతాలకు ఎంటీయూ 1271, సార్వాలో బీపీటీ 5204కు ప్రత్యామ్నాయమని చెప్పారు. ఎండాకు తెగులు, దోమపోటును పాక్షికంగా తట్టుకుంటుందని, హెక్టారుకు 7టన్నుల దిగుబడిని చ్చే మధ్యస్థ సన్న రకమని, 140 రోజుల్లో పంటకోతకు వస్తుందని తెలిపారు. అనంతరం ప్రస్తుతం సాగుచేస్తున్న ఎంటీయూ 1121, విత్తనం కోసం సాగుచేస్తున్న ఎంటీయూ 1318 వంటి రకాల పనితీరును పరిశీలించామని చెప్పారు. ప్రస్తుత దాళ్వాలో దిగుబడులు ఆశాజనకంగా ఉంటాయన్నారు. శాస్త్రవేత్త అమ్మాజీ మాట్లాడుతూ సజ్జ పంటను వచ్చే సీజనులో క్షేత్రప్రదర్శన ద్వారా చేపడుతామన్నారు. హైమజ్యోతి లాభదాయక పంటలు గూర్చి రైతులకు సూచనలిచ్చారు.

నవోదయలో ప్రవేశానికి విద్యార్థుల ఎంపిక

బిక్కవోలు/గోకవరం/కోరుకొండ/రంగంపేట, ఏప్రిల్ 1: జవహర్ నవోదయా విశ్వవిద్యాలయంలో ఆరో తరగతిలో చేరేందుకు పలువురు విద్యార్థులు ఎంపికయ్యారు. బిక్కవోలు మండలం కొమరిపాలెంలోని శ్రీరామ యూపీ పాఠశాలకు చెందిన కసిరెడ్డి వెంకటకార్తీక్‌కుమార్ ఎంపికయ్యాడని ఎంఈవో సీహెచ్‌వీవీ. సత్యనారాయణ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన కార్తీక్‌కుమార్‌ను, పాఠశాల హెచ్ఎం శ్రీనివాసరెడ్డి, డైరెక్టర్ దేవీప్రసాద్, తల్లిదండ్రులు గోవిందు, వరలక్ష్మిలను అభినందించారు. గోకవరం మండలం కొత్తపల్లి ఆదర్శ పాఠశాల విద్యార్థి కనుబోయిన సతీష్‌చంద్ర, వీరలింకపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థి పి.రాజారామ్, కొత్తూరు ప్రాథమిక పాఠశాల విద్యార్థి ఎస్.కరుణశ్రీ నవోద యలో ప్రవేశానికి ఎంపికయ్యారు. ఇదిలా ఉండగా కోరుకొండ మండలం శ్రీరంగపట్నం గ్రామానికి చెందిన ముగ్గురు విద్యార్థులు సీట్లు సాధించారు. ఎస్ఎస్‌సీ ఇంగ్లీషు మీడియం యూపీ పాఠశాలలో చదువుకుంటున్న ఏలేటి కీర్తన, గింజాల చంద్రవర్షిణి, ఆడపా జ్యోతిరంజన్ ఎంపికయ్యారు. అలాగే కోరుకొండ గ్రామం సరస్వతి విద్యానికేతన్‌కు చెందిన 8వ తరగతి విద్యార్థిని నవోదయలో 9వ తరగతిలో ప్రవేశానికి లాటరల్ ఎంట్రీగా ఎంపికైందని కరస్పాండెంట్ పెనకటి గంగాధరరావు తెలిపారు. రంగంపేట మండలం సింగంపల్లి శ్రీవిద్యా స్కూల్ విద్యార్థి కొండేపూడి సత్యఆదిత్య నీలగౌతమ్ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ వెంకటరమణ తెలిపారు.

ఉద్యోగ విరమణ పొందిన ఎస్ఐకి సత్కారం



రాజమహేంద్రవరం, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ విరమణ పొందిన సాయుధ రిజర్వు ఎస్ఐ కె.రామసత్యనారా యణ (ఏఆర్ ఎస్ఐ-361)ను ఎస్పీ జగదీశ్ సత్కరించారు. ఆయన పోలీస్ డిపార్టుమెంట్‌కు చేసిన సేవలను కొనియాడారు. శాఖాపరంగా ఏ అవసరం ఉన్నా స్వయంగా తనకు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు ఎస్ఆర్ రాజశేఖర్ రాజు, ఎల్.చెంచిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీలో సింగిల్ మేజర్ వ్యవస్థపై శిక్షణ

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 1 : రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో సోమవారం డిగ్రీలో సింగిల్ మేజర్ వ్యవస్థపై శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. కళాశాల నోడల్ రిసోర్సు విభాగం ఆధ్వర్యంలో చరిత్ర, రాజనీతి శాస్త్ర అధ్యాపకులకు శిక్షణ ఇచ్చారు. 2023 విద్యాసంవత్సరం నుంచి డిగ్రీ విద్యార్థులకు సింగిల్ మేజర్ సిస్టంను ప్రవేశపెట్టడం జరిగిందన్నారు.రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ కమిషనరేట్ అధికారులు ఈ విధానంపై అధ్యాపకులకు శిక్షణ ఇవ్వడం జరుగుతున్నదని ఆర్ట్స్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శాస్త్రి తెలిపారు. ఈ నెల 6వ తేదీ వరకూ శిక్షణ ఉంటుందన్నారు. రాజనీతి శాస్త్ర విభాగానికి సంబంధించి ఆరు నోడల్ రిసోర్సు సెంటర్ల నుంచి 63 మంది రాజనీతి శాస్త్ర అధ్యాపకులు, రెండు రిసోర్సు సెంటర్ల నుంచి 17 మంది చరిత్ర అధ్యాపకులు పాల్గొన్నారు.

వృద్ధులకు ఇబ్బందులుంటే చెప్పండి

జీవకారుణ్య సంఘం పరిశీలనలో డీఎల్ఎస్ఏ కార్యదర్శి



రాజమహేంద్రవరం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): గౌతమి జీవకారుణ్య సంఘం లోని వృద్ధాశ్రమాన్ని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూష కుమారి సందర్శించారు. వసతులు, సదుపాయాలను పరిశీలించారు. పిల్లలు, వృద్ధులతో మాట్లాడి ఏవైనా ఇబ్బందులుంటే తమకు తెలియజేయాలని సూచించారు. వంటగది, ఆహారాన్ని పరిశీలించారు. వేసవి ముగిసే వరకైనా వృద్ధులకు మజ్జిగ అందించాలని సూచించారు. ఎండ వేడి మికి ఇబ్బంది పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు.

ఇళ్ల వద్దే పింఛన్లు పంపిణీ చేయండి

ఆర్‌వోకు ఉమ్మడి అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్ విజ్ఞప్తి

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 1: వృద్ధులు, దివ్యాంగులకు వారి ఇళ్ల వద్దే పింఛన్లు ఇప్పించే ఏర్పాట్లు చేయాలని రాజమహేంద్రవరం టీడీపీ-జనసేన-బీజేపీ ఉమ్మడి అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్ కమిషనర్, ఆర్‌వో దినేష్‌కుమార్‌ను సోమవారం విజ్ఞప్తి చేశారు. నడవలేని స్థితిలో ఉన్న వృద్ధులు, దివ్యాంగులు సచివాలయాకు వెళ్లలేరని అందువల్ల వారికి ఇళ్ల వద్దే పింఛన్లు పంపిణీ చేయించాలని లిఖితపూర్వకంగా విజ్ఞప్తి చేశారు.

ఇంటింటా ప్రచారం.. రాజమహేంద్రవరాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని ఉమ్మడి అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. రాజమహేంద్రవరం 22వ డివిజన్‌లో సోమవారం ఇంటింటా ప్రచారం చేశారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మాటూరి రంగారావు, శెట్టి జగదీష్, మాటూరి సిద్ధు, ఎంఎస్ రావు, కొత్తా రాజేష్, తక్కశెల పూర్ణ పాల్గొన్నారు.

తోకాడలో ముగిసిన టైలరింగ్ శిక్షణ

రాజానగరం, ఏప్రిల్ 1: డాక్టర్ వినయ్ సుంకర ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలో తోకాడలో నిర్వహించిన ఉచిత టైలరింగ్ శిక్షణ కార్యక్రమం సోమవారం ముగిసింది. సుంకర వెంకటేశ్వరావు మాట్లాడుతూ మానవసేవే మాధవ సేవ అన్నారు. ఈపూరి దుర్గ శిక్షకురాలిగా వ్యవహరించారు. ఈ సందర్భంగా శిక్షణ పొందిన 50 మంది మహిళలకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో మేనేజింగ్ ట్రస్టీ సుంకర వీరాస్వామి, వినీల పాల్గొన్నారు.

బూరుగుపూడి సొసైటీ రైతు సమావేశం

కోరుకొండ, ఏప్రిల్ 1: బూరుగుపూడి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ప్రస్తుతం రూ.18.50కోట్లు టర్నోవర్‌ను కలిగి ఉందని సీఈవో ఈదల సుదర్శనరావు తెలిపారు. బూరుగుపూడి సొసైటీ రైతు సమావేశం సొసైటీ త్రిసభ్య కమిటీ అధ్యక్షుడు బుడ్డిగ సత్యనారాయణ (సత్తిబాబు)అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. సత్తిబాబు మాట్లాడుతూ గతంలో సొసైటీలో ఉన్న నష్టాలను చాలా వరకు తగ్గించుకుంటూ వచ్చామన్నారు. రైతులకు రైతు నేస్తం రుణాలు మంజూరయ్యే విధంగా కృషి చేస్తామన్నారు. సొసైటీ ద్వారా డిపాజిట్లు సేకరించి బంగారంపై రుణాలు అందించేందుకు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. సొసైటీ ద్వారా కామన్ సర్వీస్‌సెంటర్‌ను నిర్వహిస్తున్నామని వెల్లడించారు. సమావేశంలో ఏఎంసీ చైర్మన్ నక్కారాంబాబు, త్రి సభ్య కమిటీ సభ్యులు ఈర్ల గంగేశ్వరుడు, అడపా రామకృష్ణ, రైతు నాయకుడు సీంద్రిం శ్రీహరి వర్మ, చేశెట్టి రాము, బూరుగుపూడి, గుమ్ములూరు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

ప్రజాశాంతికి భంగం కలిగిస్తే చర్యలు

సౌత్‌జోన్ డీఎస్పీ అంబికా ప్రసాద్

కడియం, ఏప్రిల్ 1: పబ్లిక్ స్థలాల్లో దురుసు ప్రవర్తన, న్యూసెన్స్ చేస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని సౌత్‌జోన్ డీఎస్పీ ఎం అంబికా ప్రసాద్ తెలిపారు. కడియం దేవీసెంటర్‌లో ఆదివారం సాయంత్రం ఘర్షణకు పాల్పడి ప్రజాశాంతికి భంగం కలిగించే విధంగా ప్రవర్తించిన ఆకతాయిలకు కౌన్సిలింగ్, జగడం ఆడినందుకు కేసు నమోదు చేసినట్టు చెప్పారు. పోలీసుల వివరాల ప్రకారం కడియం సెంటర్‌లో కొందరు యువకులు చిన్న కారణంగా రెండు వర్గాలుగా విడిపోయి ఘర్షణకు పాల్పడి న్యూసెన్స్ చేశారు. స్థానికుల సమాచారంతో పోలీసులు అక్కడికి వెళ్ళడంతో కొంతమంది పరారయ్యారు. మరికొందరు తాము కాదంటూ పోలీసులతో వాదనకు దిగారు. ఎస్ఐ బీఎన్ దుర్గాప్రసాద్, పోలీసు సిబ్బంది కలిసి ఘటనకు పాల్పడిన 8 మంది యువకులను గుర్తించి, పెద్దల సమక్షంలో కౌన్సిలింగ్ ఇచ్చామన్నారు. అలానే బహిరంగ ప్రదేశంలో ఘర్షణకు పాల్పడినందుకు కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు. డీఎస్పీ ప్రసాద్ పర్యవేక్షించి, సీఐ తులసీధర్‌కు, పోలీసు సిబ్బందికి సూచనలు చేశారు.

సభలు, సమావేశాలకు అనుమతి తప్పనిసరి

ఈస్ట్‌జోన్ డీఎస్పీ కిషోర్‌కుమార్



రంగంపేట, ఏప్రిల్ 1:ముందస్తు అనుమతి లేకుండా సభలు, సమావేశాలు, ఊరేగింపులు వంటివి జరపడానికి వీల్లేదని ఈస్ట్‌జోన్ డీఎస్పీ ఎం.కిషోర్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఎన్నికల దృష్ట్యా సెక్షన్-30 అమలులో ఉందని, శాంతిభద్రతలకు భంగం కలగకుండా వ్యవహరించాలని అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు. లేని పక్షంలో క్రిమినల్ చర్యలు తీసుకుంటాని హెచ్చరించారు.

శహపురంలో 'న్యాయం కోసం నల్లమిల్లి'

అనపర్తి, ఏప్రిల్ 1: టీడీపీ, జనసేన, బీజేపీ పొత్తులో భాగంగా అనపర్తి అసెంబ్లీ సీటును కోల్పోయిన టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి చేపట్టిన న్యాయం కోసం నల్లమిల్లి కార్యక్రమం సోమవారం పెదపూడి మండలం శహపురంలో జరిగింది. తల్లి సత్యవతి, సతీమణి మహాలక్ష్మి, కుమారుడు మనోజ్‌రెడ్డి, కుమార్తె డాక్టర్ సనాతనితో కలిసి ఆయన గ్రామంలో పర్యటించారు. తన భవిష్యత్ ప్రణాళిక ప్రజల అభిప్రాయంతో ముడిపడి ఉందని, ఏమి చేయాలో వారే చెప్పాలంటూ ఇంటింటికీ వెళ్లి పరిస్థితిని వివరించారు. ఈ సందర్భంగా తన తల్లి సత్యవతిని రిక్షాలో కూర్చోబెట్టి తిప్పడంతో ప్రజల్లో విపరీతమైన సానుభూతి వ్యక్తమైంది. చంద్రబాబు అనపర్తి సీటును రామకృష్ణారెడ్డికే కేటాయిస్తారని, అధైర్య పడొద్దని గ్రామస్థులు మద్దతు పలికారు. ఈ సందర్భంగా నల్లమిల్లి మీడియాతో మాట్లాడుతూ అనపర్తిలో పార్టీని కాపాడుకోవడం ఎంత ముఖ్యమో తనను నమ్ముకున్న కార్యకర్తలను రక్షించుకోవడం కూడా అంతే ముఖ్యమన్నారు. ఇప్పటికైనా మూడు పార్టీల అధినేతలు పునరాలోచన చేసి సమర్థులైన వారికి టికెట్లు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కాలవలోకి దిగి యువకుడి మృతి

కడియం, ఏప్రిల్ 1: కడియం మండలం దామిరెడ్డిపల్లికి చెందిన రావిపాటి అయ్యప్ప(25) కడియపులంక కాలవలో స్నానానికి దిగి మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం అయ్యప్ప పూలు అమ్ముతుంటాడు. కడియపులంక పూలమార్కెట్‌కు వెళుతూ స్నానం కోసం కాలువలోకి దిగాడు. ప్రమాదవశాత్తూ మునిగిపోయి మృతి చెందాడు. స్థానికులు గమనించి సమాచారం అందించడంతో పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

భార్య మృతి కేసులో భర్తకు రెండేళ్ల జైలు

రాయవరం, ఏప్రిల్ 1: వేధింపులతో భార్య మృతికి కారణమైన నిందితుడికి రెండేళ్ల జైలు శిక్ష, జరిమానా విధిస్తూ రామచంద్రపురం అసిస్టెంట్ సెషన్స్ కోర్టు జడ్జి కె.వెంకటేశ్వరరావు తీర్పు చెప్పారని రాయవరం ఎస్ఐ జి.నరేష్ సోమవారం తెలిపారు. కడియం మండలం దుళ్ల గ్రామానికి చెందిన జక్కం దేవికి రాయవరానికి చెందిన పిచ్చుక బుల్లియ్యతో వివాహమైంది. కొంతకాలం తర్వాత బుల్లియ్య భార్య దేవిని మానసికంగా, శారీరకంగా వేధింపులకు గురిచేశాడని, అల్లుడు వేధింపుల వల్ల తన కుమార్తె ఆత్మహత్యకు పాల్పడిందని మృతురాలి తండ్రి జక్కం వీరవెంకట సత్యనారాయణ 2015లో పోలీసులు ఫిర్యాదు చేశాడు. అప్పటి ఎస్ఐ సురేష్‌చావా కేసు నమోదు చేశారు. కోర్టులో వాదనలు అనంతరం ఈకేసులో ఏ1గా ఉన్న బుల్లియ్యకు రెండేళ్ల జైలు శిక్ష, రూ.5వేలు జరిమానా విధిస్తూ జడ్జి కె.వెంకటేశ్వరరావు తీర్పు చెప్పినట్లు ఎస్ఐ తెలిపారు. ఫిర్యాదుదారుడు తరఫున పీపీ ఎంవీవీ సూర్యప్రకాష్ వాదనలు వినిపించారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

రంగంపేట, ఏప్రిల్ 1: ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఓ వృద్ధుడు మృతి చెందాడని ఎస్ఐ పి.విజయ్‌కుమార్ సోమవారం తెలిపారు. మండలంలోని సింగంపల్లికి చెందిన బోడెం అప్పారావు(79) కూరగాయల వ్యాపారం చేస్తుంటాడు. గత నెల 28న తన మోపెడ్‌పై ఉదయం వ్యాపారానికి బయలుదేరాడు. నల్లమిల్లి దాటిన తరువాత బీర్ ఫ్యాక్టరీ సమీపంలోని సూరమ్మ చెరువు వద్ద రోడ్డుపై స్పృహ తప్పి పడిపోవడంతో స్థానికులు వ్యక్తులు చూసి కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. దీంతో అనపర్తి ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా పరిస్థితి విషమంగా ఉండడంతో కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మధ్యాహ్నం మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారని ఎస్ఐ తెలిపారు. మృతుడి రెండో కుమారుడు బోడెం శ్రీను ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

గామన్ బ్రిడ్జిపై తవుడు లోడ్ లారీ దగ్ధం

దివాన్‌చెరువు, ఏప్రిల్ 1: రిఫండ్ ఆయిల్ తయారు చేసేందుకు ముడిసరుకు తీసుకువెళ్తున్న లారీ సోమవారం ప్రమాదవశాత్తూ దగ్ధమైంది. ఈ సంఘటనలో రూ2.50 లక్షల విలువైన ముడిసరుకు కాలిబూడిదైందది. అయితే డ్రైవరు, క్లీనరు అప్రమత్తంగా వ్యవహరించడంతో పెనుప్రమాదం తప్పింది. బొమ్మూరు పోలీసుల వివరాల ప్రకారం.. నూనె తయారీకి ముడిసరుకు తవుడు లోడ్‌తో లారీ కలకత్తా నుంచి గుండుగొలను వెళుతోంది. గామన్ బ్రిడ్జిపై కొవ్వూరు వైపు వెళ్తుండగా లారీ క్యాబిన్‌లో సెల్ఫ్‌మోటారు నుంచి ఒక్కసారిగా మంటలు వచ్చాయి. డ్రైవరు, క్లీనర్ వెంటనే కిందకు దిగిపోవడంతో పెనుప్రమాదం తప్పింది. సమాచారం అందుకున్న బొమ్మూరు పోలీసులు అగ్నిమాపక కేంద్రానికి తెలపడంతో ఫైర్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు.

రంజాన్ వేళలు
ఇఫ్తార్ (మంగళ) సా. 6.25
సహరి(బుధ) ఉ. 4.34

రాజమహేంద్రవరం లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థిగా రుద్రరాజు 8



కోనసీమ జిల్లా రావులపాలెంలో చంద్రబాబు సభ ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న కూటమి నాయకులు

రేపటి నుంచి చంద్రబాబు ప్రజాగళం

- రేపు రావులపాలెం, రామచంద్రపురంలలో సభలు
- 4న గోపాలపురం, కొవ్వూరు నియోజకవర్గాల్లో పర్యటన
- అనంతరం పశ్చిమకు పయనం - వేడెక్కిన రాజకీయం

రావులపాలెం/అమలాపురం/నల్లజర్ల/రాజమహేంద్రవరం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ప్రజాగళం పేరుతో ఎన్నికల ప్రచారం సాగిస్తున్న టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు బుధవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా నుంచి గోదావరి జిల్లాలో సార్వత్రిక ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టనున్నారు. ఆయన కొత్తపేట, రామచంద్రపురం నియోజకవర్గాల్లో పర్యటించనున్నారు. ఈ మేరకు కోనసీమ ముఖద్వారమైన రావులపాలెంలో చంద్రబాబు పర్యటన ఏర్పాట్లను కొత్తపేట అసెంబ్లీ కూటమి అభ్యర్థి బండారు సత్యానందరావు, జోన్-2 ఇన్‌చార్జి సుజయ కృష్ణరంగారావు, పొలిట్‌బ్యూరో సభ్యుడు రెడ్డి సుబ్రహ్మణ్యం, అమలాపురం లోక్‌సభ అభ్యర్థి గంటి హరీశ్‌మాధుర్, జనసేన కొత్తపేట ఇన్‌చార్జి బండారు శ్రీనివాస్, బీజేపీ పదాధికారి తమలంపూడి రామకృష్ణారెడ్డి, తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ సోమవారం పరిశీలించారు. రావులపాలెం కెనాల్ రోడ్డులో బహిరంగ సభా స్థలి ప్రదేశం, మల్లాయిదొడ్డిలో హెలిపాడ్ ఏర్పాటు, అక్కడకు సమీపంలో ఉన్న ఓ ఫంక్షన్ హాలులో ముఖ్య నేతలతో మాట్లాడేందుకు వీలుగా ఉన్న కల్యాణ మండపాన్ని పరిశీలించారు. రావులపాలెం సభ అనంతరం రామచంద్రపురం పర్యటనకు చంద్రబాబు హెలికాప్టర్‌లో వెళతారని సమాచారం.రామచంద్రపురం నియోజకవర్గ పరిధిలోని ద్రాక్షారామలో బుధవారం సాయంత్రం జరిగే బహిరంగ సభలో పాల్గొంటారు. మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు రెండు నియోజకవర్గాల్లో చంద్రబాబు పర్యటన కొనసాగుతుందని టీడీపీ నేతలు పేర్కొంటున్నారు. రాత్రికి రామచంద్రపురంలో బస చేసే అవకాశం ఉంది.ఈ మేరకు నాయకులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు, గోపాలపురం ఎస్సీ రిజర్వుడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో 4వ తేదీ గురువారం పర్యటిస్తారు.గోపాలపురం నియోజకవర్గం నల్లజర్లలో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నారు. ఈ మేరకు సోమవారం స్థల సేకరణ పనిలో టీడీపీ నాయకులు నిమగ్నమయ్యారు. నల్లజర్లలో లేదంటే గోపాలపురం,దేవరపల్లి మండలాల్లో బహిరంగ ఏర్పాటు చేసే దిశగా ప్రయత్నాలు చేస్తున్నారు. కొవ్వూ రులోనూ ఏర్పాట్లు చేస్తున్నారు. పశ్చిమ గోదావరి జిల్లా తణుకు,పాలకొల్లు నియోజకవర్గాల్లో 5వ తేదీన పర్యటించనున్నారు. ఇప్పటికే జనసేన అధినేత పవన్ కల్యాణ్ కాకినాడ జిల్లా పరిధిలోని పిఠాపురంలో పర్యటించిన సంగతి తెలిసిందే. ఆయన రాకతో రాజకీయం వేడెక్కింది. టీడీపీ అధినేత చంద్రబాబు కూడా రానుండడంతో కూటమిలో మరింత జోష్ పెరగనుంది.ఈ నెల 5 నుంచి రాజ మహేంద్రవరం ఎంపీ అభ్యర్థి పురందేశ్వరి బరిలో దిగనున్నారు.

పిఠాపురం.. ఇక నా స్వస్థలం



కార్యక్రమంలో మాట్లాడుతున్న పవన్‌కల్యాణ్

- ఏదో ఒక గ్రామంలో ఇల్లు తీసుకుంటా
- నియోజకవర్గ సర్వతోముఖాభివృద్ధి నా బాధ్యత
- ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటా
- జనసేన అధినేత పవన్‌కల్యాణ్
- జనసేనలో భారీగా చేరికలు

పిఠాపురం, ఏప్రిల్ 1: 'పిఠాపురాన్ని నా స్వస్థలం చేసుకోవడానికే ఇక్కడకు వచ్చా. నియోజకవర్గంలోని 54 గ్రామాల్లో ఏదో ఒకచోట ఇల్లు తీసుకుని ఉంటా. నన్ను ఒక్కసారి గెలిపించమని భగవంతుడిని కోరితే పిఠాపురం పిలిచింది. మనం భారీ మెజార్టీతో గెలవబోతున్నాం'అని జనసేన అధినేత పవన్ కల్యాణ్ అన్నారు. పిఠాపురం మండలం కుమారపురంలోని గోకులం గ్రాండ్‌లో సోమవారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో పిఠాపురం నియోజకవర్గానికి చెందిన ప్రముఖ వైద్యులు, న్యాయవాదులు, వివిధ వర్గాల ప్రముఖులు, వైసీపీకి చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సొసైటీల చైర్మన్లు, నాయకులు జనసేన పార్టీలో చేరారు. వారందరికీ పవన్ జనసేన కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పిఠాపురం నియోజకవర్గంలోని అందరినీ వ్యక్తిగతంగా కలవాలన్న ఆశ తనకు ఉన్నప్పటికీ భద్రతాపరమైన కారణాలతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని పవన్ తెలిపారు. ప్రత్యర్థుల పన్నాగాలు గమనిస్తూ మనమంతా ముందుకు సాగాల్సిన అవసరం ఉందని చెప్పారు. భద్రతాపరమైన ప్రొటోకాల్ పాటిస్తూ రోజుకి 200 మందిని కలిసి వారితో ఫొటోలు తీసుకుంటానని తెలిపారు. శ్రీపాదశ్రీవల్లభుడు, పురుహూతికా అమ్మవారు, బషీర్ బీబీ (బంగారు పాప) దర్గా, ఆంధ్రా బాప్టిస్టు చర్చి సాక్షిగా ప్రజలందరికీ ఎల్లప్పుడు అందుబాటులో ఉంటూ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. తాను భగవంతుడినీ ఏదీ కావాలని కోరుకోనని, అయితే సినిమాలు వరుసగా ఫ్లాప్ అవుతున్న సమయంలో నల్గొండకు చెందిన అభిమాని వచ్చి ఒక్క హిట్ ఇవ్వు అన్నా అని అడిగాడు. అప్పుడు ఒక్క హిట్ ఇవ్వమని, భీమవరంలో ఓడిపోయిన తర్వాత గెలుపు ఇవ్వమని భగవంతుడిని కోరానని, ఆ మేరకు తనను పిఠాపురం పిలిచిందని చెప్పారు. నియోజకవర్గంలో ఏ ప్రాంతంలో ఉండాలన్నదీ త్వరలో నిర్ణయించుకుంటానని, పురుహూతికా అమ్మవారి ఆశీస్సులతో ఇక్కడే ఏదో ఒక గ్రామంలో ఇల్లు తీసుకుని ఉంటానన్నారు. పగిలే గాజు గ్లాసుకు పదును ఎక్కువన్నారు. అందరినీ ప్రత్యేకించి కలుస్తానని, ప్రతి ఒక్కరి సమస్యలనూ తెలుసుకుంటానని తెలిపారు. పార్టీలో కష్టపడిన ప్రతి ఒక్కరికీ గుర్తింపు ఉంటుందని చెప్పారు. అందుకు కాకినాడ ఎంపీ అభ్యర్థి ఉదయ్ శ్రీనివాస్ నిదర్శనమన్నారు. వచ్చే 25 సంవత్సరాల్లో కొత్తతరం నాయకులు ముందుకు రావాలని కోరారు. ఇప్పటి నుంచీ నిలబడితేనే రేపటి రోజున నాయకులు తయారవుతారని తెలిపారు. జనసేన పార్టీ నియోజకవర్గ స్థాయి నుంచి మండల, గ్రామస్థాయి వరకు నాయకులను తయారు చేస్తుందని చెప్పారు. కాకినాడ ఎంపీ అభ్యర్థి ఉదయ్ శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ ఉపాధ్యక్షుడు బి.మహేందరరెడ్డి, ఎన్నికల సమన్వయ కమిటీ సభ్యులు వేములపాటి అజయకుమార్, పి.హరిప్రసాద్, మర్రెడ్డి శ్రీనివాస్, కె.శరత్, కార్యక్రమాల నిర్వహణ కమిటీ చైర్మన్ కల్యాణం శివ శ్రీనివాస్, తెలంగాణా ఇన్‌చార్జి ఎన్.శంకరగౌడ్, మాజీ ఎంపీపీ కురుమళ్ల రాంబాబు తదితరులు పాల్గొన్నారు. కాగా పిఠాపురం నియోజకవర్గం, ఇతర ప్రాంతాల ప్రముఖులు పవన్ సమక్షంలో జనసేనలో చేరారు. వారిలో ప్రముఖ వైద్యురాలు డాక్టర్ వరలక్ష్మి, న్యాయవాదులు సూరవరపు వెంకటేశ్వరరావు, త్రినాథ్, వెంకటరమణ, అరుణ్‌బాబు, కన్నా ఆశ్రయ్ ఫౌండేషన్ చైర్‌పర్సన్ గండి శకుంతలాదేవి, వంతల నందీశ్వరి, సూరవరపు సురేష్, మారిశెట్టి బుజ్జి, ఊటా సత్యనారాయణ, ఎలుబండి ప్రభు, డాక్టర్ ఆర్.మోహనరావు, కోడిగుడ్డి రాజేష్, గారపాటి శ్రీనివాసరావు, బస్వా ప్రసాద్, మేరుగు జగదీష్, ఎండీ జాఫర్ షరీఫ్, షేక్ ఖాదీర్, నజీర్, అబ్దుల్ ఖయూమ్, లోకారెడ్డి రామకృష్ణ, బొజ్జా లోవరాజు, యా పాటి అరుణ్‌బాబు, కుక్కా శ్రీను ఉన్నారు.





పిఠాపురంలో జనసేన పార్టీలో చేరిన ప్రముఖ వైద్యురాలు డాక్టర్ వరలక్ష్మి... కన్నా ఆశ్రయ్ ఫౌండేషన్ చైర్‌పర్సన్ గండి శకుంతలాదేవి

నేటి పర్యటన ఇలా..

సోమవారం మధ్యాహ్నం 1.40 గంటలకు గొల్లప్రోలులోని హెలిపాడ్‌కు చేరుకున్న పవన్‌కల్యాణ్ సాయంత్రం 5.15 గంటలకు గొల్లప్రోలు హెలిపాడ్ నుంచి హైదరాబాదుకు హెలికాప్టర్‌లో పయనమయ్యారు. ఆయన తిరిగి మంగళవారం నియోజకవర్గానికి వస్తారు. ఉదయం 9 గంటలకు హెలిపాడ్ నుంచి బయలుదేరి పిఠాపురంలోని ఏబీసీ (ఆంధ్ర బాప్టిస్ట్ చర్చ్)కు, తర్వాత కొత్తపల్లి మండలం పొన్నాడలోని బషీర్‌బీబీ దర్గా (బంగారు పాప)లకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొంటారు. తర్వాత యు కొత్తపల్లి మండలం కొత్తపల్లిలోని సురక్ష ప్యాలెస్ ఫంక్షన్ హాలులో మహిళలతో సమావేశంలో పాల్గొంటారు. అక్కడ నుంచి పిఠాపురం చేరుకుని వివిధ జంక్షన్లలో పర్యటిస్తారు. ఆయా కార్యక్రమాల్లో ప్రజలు పెద్దఎత్తున పాల్గొనాలని జనసేన కార్యాలయం ఒక ప్రకటనలో కోరింది.

జనసేనలో చేరిన మండలి బుద్ధప్రసాద్

పిఠాపురం, ఏప్రిల్ 1: జనసేన పార్టీలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రముఖులు చేరేందుకు పిఠాపురం వేదిక అయ్యింది. పిఠాపురం మండలం కుమారపురం గ్రామంలోని గోకులం గ్రాండ్ హోటల్‌లో సోమవారం జరిగిన కార్యక్రమంలో అవనిగడ్డ మాజీ ఎమ్మెల్యే, అసెంబ్లీ మాజీ డిప్యూటీ స్పీకర్ మండలి బుద్ధప్రసాద్, పాలకొండ నియోజకవర్గానికి చెందిన నిమ్మక జయకృష్ణ, రైల్వేకోడూరు నియోజకవర్గం సర్పంచ్ శ్రీధర్ పవన్ కల్యాణ్ సమక్షంలో జనసేన తీర్థం పుచ్చుకున్నారు. వారందరికీ పవన్ సాదర స్వాగతం పలికారు. పార్టీలో చేరిన అనంతరం మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ అవనిగడ్డ నియోజకవర్గం నుంచి పోటీకి నిలవమని పవన్ తనను కోరగా చంద్రబాబు మద్దతు ఇచ్చారన్నారు. జగన్ ఐదేళ్ల పాలనలో ఏపీలో జరగని అరాచకం లేదని మండిపడ్డారు. వేల కోట్ల దోపిడీ జరిగిందని ఆరోపించారు. తెలుగు భాషాభివృద్ధికి తాను చేసిన కృషిని పవన్ ఎన్నోసార్లు మెచ్చుకున్నారని ఆయన గుర్తు చేసుకున్నారు. శ్రీకాకుళం జిల్లా పాలకొండ నియోజకవర్గానికి చెందిన నిమ్మక జయకృష్ణ మాట్లాడుతూ తనకు సీటు వస్తుందని ఆశిస్తున్నట్టు చెప్పారు. పాలకొండలో వైసీపీ నాయకుల అక్రమాలు దారుణంగా ఉన్నాయని ఆయన తీవ్ర స్థాయిలో విమర్శించారు.

వైచీఫ్ ట్రిక్స్!



ఇదేంది సార్ : రాజమండ్రి రామచంద్రరావు పేటలో సగం వేసి వదిలేసిన రోడ్

- ఎక్కడికక్కడ హడావుడిగా పనులు
- సీసీ రోడ్లూ వెలుస్తున్నాయ్..
- గోతులు పూడుకుపోతున్నాయి..
- డ్రైనేజీలు కట్టేస్తున్నారు..
- శిలాఫలకాలు పెట్టేస్తున్నారు
- ఐదేళ్లు గాలికి.. ఇప్పుడు సీన్‌లోకి
- నవ్వుకుంటున్న జనం

ఐదేళ్లు జనం పడిన బాధలు అన్నీ ఇన్నీ కావు.. ఏ రోడ్డు చూసినా గోతులే.. ఇదేం ప్రభుత్వం రా బాబూ.. అసలు ఏమీ పట్టదు.. ఈ రోడ్డు ఎప్పుడు వేయిస్తుందో అని ప్రతి ఒక్కరూ ఎదురుచూసిన వారే.. అయినా గుర్తుకు రాలేదు.. నాయకులకు వినతులిచ్చినా పట్టించుకోలేదు.. అధికారులకు చెప్పినా స్పందన లేదు.. ఈ ప్రభుత్వం సంగతేంటో చూద్దాం అనుకున్నారంతా.. అయితే సీఎం జగన్ ఊరుకుంటాడా.. మసిపూసి మారేడుకాయ చేసేందుకు సిద్ధమైపోయాడు.. ఎన్నికల వేళ ఎక్కడపడితే అక్కడ రోడ్లు వేస్తున్నారు.. డ్రైనేజీలు కడుతున్నారు.. అడిగినవాడికి అడిగిన పనిచేస్తున్నారు.. ఎక్కడ చూసినా హడావుడి చేస్తున్నారు.. అయితే జనం నమ్ముతారా..!! ఎన్నికల వేళ వై..చీఫ్ ట్రిక్స్ అని నవ్వుతున్నారు.. 2019లో మా నమ్మకం నువ్వే జగన్ అన్నవారే.. ప్రస్తుతం 2024 ఎన్నికల వేళ నిన్ను నమ్మలేం జగన్ అంటున్నారు..

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

అధికారం చేతబట్టి నాలుగేళ్ల పది నెలలు గడిచింది. ఇంకా రెండు నెలల్లో పీఠం ఖాళీ చేయాల్సిన పరిస్థితి.. ఇన్నాళ్లూ లేని బాధ్యత, పట్టని ప్రజల తిప్పలు ఎన్నికల కోడ్ కూయడానికి కొద్ది గంటల ముందు.. పాలనాకాలం చివర్లో వైసీపీ నేతలకు ఠక్కున గుర్తొచ్చేశాయి.ఏది పడితే అది ప్రారంభం, ఎక్కడ పడితే అక్కడ శంకుస్థాపనలు, శిలాఫలకాలు,రిబ్బను 'కటింగ్'లు.. ఈ తంతు చూస్తున్న జనం విస్తుపోతున్నారు. ఐదేళ్లు ఏమైపోయారు.. హంగామాకు అభివృద్ధి పేరు తగిలించి మళ్లీ 'గాలి' చూపించి ఓట్లు లాక్కుందామనే దురాశలో భాగమేనని స్పష్టం చేస్తున్నారు. నగరాలు, గ్రామాల్లో జరుగుతున్న హడావుడి చూస్తుంటే వారి ఆరోపణల్లో నిజం లేకపోలేదనిపిస్తోంది. ఎన్నికల ప్రవర్తనా నియమావళి 16న సాయంత్రం ప్రకటించే అవకాశం ఉందని ఒకరోజు ముందు తెలిసింది. దీంతో ఒక్కసారిగా వైసీపీ నేతల్లో ఉత్సాహం తన్నుకొచ్చింది. ఏది పడితే అది చేసేస్తామంటూ హడావుడి మొదలు పెట్టారు. 15వ తేదీ అర్ధరాత్రి కూడా శంకుస్థాపనలు చేసి, చీకట్లోనే శిలాఫలకాల రిబ్బన్లను కత్తిరించారు. ఇక ఎన్నికల కోడ్ వచ్చిన తర్వాత మరింత తెలివి ప్రదర్శిస్తూ కుళాయిలు, వీధిలైట్లు వేయడం చేస్తున్నారు. ఎన్నికల వేళ అభివృద్ధి కలరింగ్ ఇస్తున్నారు. ఓట్ల కోసం కొత్త నాటకానికి తెరలేపారు. గమనించిన ప్రజలు ఇన్నాళ్లు లేనిది ఇప్పుడు గుర్తొచ్చిందా అంటూ ముక్కున వేలేసుకుంటున్నారు..పెద్ద పనులు పక్కన పెట్టేసి చిన్న పనులతో మమ అనిపిస్తున్నారనే ఆరోపణలున్నాయి.

ఎన్నికల వేళ..అభివృద్ధి గుర్తొచ్చిందా..!?

కోడ్ ముందు గుర్తొచ్చాయి..

ఎన్నికల కోడ్ వచ్చిన రెండు రోజుల ముందు నుంచీ అధికారులకు, సిబ్బందికి కంటిపై కునుకు లేదు. ఏదోలా ఎక్కడో అక్కడ శిలాఫలకాలు వేయాలంటూ వైసీపీ నాయకుల ఒత్తిడితో ఎడాపెడా ఎస్టిమేట్లు వేసేసి వాయువేగంతో అనుమతి ఇచ్చేసి ప్రారంభోత్సవాలు పూర్తి చేసేశారు. జిల్లాలోని రాజమహేంద్రవరం కార్పొరేషన్, నిడదవోలు, కొవ్వూరు మునిసిపాలిటీలు మిగతా పంచాయతీల్లో అభివృద్ధి పేరుతో విధ్వంసమే సృష్టిస్తున్నారు. ఎక్కడ చూసినా హంగామాతో మభ్యపె డుతున్నారు. జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో నాలుగేళ్ల కిందట శిలాఫలకాలు వేసి మర్చిపోయారు. మళ్లీ అదే పనులకు అక్కడే కొత్తగా శిలాఫలకాలు వేస్తూ వెర్రి వేయి విధాలు అనే నానుడిని నిజం చేశారు. చాలా ప్రాంతాల్లో కుళాయిలు, వీధిలైట్లు వేస్తూ వాటిని ప్రచారానికి వాడుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. పోనీ వీటన్నిటికీ రాష్ట్ర ప్రభుత్వం నిధులు ఇచ్చిందా? అంటే అదీ లేదు. స్థానిక సంస్థల సాధారణ నిధుల నుంచి ఖర్చు చేస్తున్నారు.

ఎన్నికల వేళయ్యిందనీ..

రాజమహేంద్రవరం రూరల్ పరిధిలోని కాటన్ బ్యారేజ్ గత నాలుగన్నరేళ్లుగా గోతులతో నిండే ఉంది. ఎవరైనా వెళితే అయ్యబాబోయ్ అనే పరిస్థితి.. ఇటీవల రెండు నెలల కిందట హడావుడిగా పనులు పూర్తిచేశారు. మరి ఇన్నాళ్లు ఏమైపోయారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇక హుకుంపేట - బొమ్మూరు రహదారిపై నెల కిందట వెళ్లామంటే నరకమే.. ఎక్కడ గొయ్యిందో.. ఎక్కడ రోడ్డుందో తెలియని పరిస్థితి.. ఆ రోడ్డుపై ఎంతో మంది తీవ్ర గాయాలపాలయ్యారు. అయినా పట్టించుకోలేదు.. గత రెండు నెలలుగా ఆ రోడ్డు పనులు సాగుతున్నాయి. మరీ ఇన్నాళ్లు ఏమైపోయారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. సీతానగరం - కోరుకొండ రోడ్డు పరిస్థితి ఇంతే. రోడ్డును నాలుగేళ్లుగా నిర్మిస్తూనే ఉన్నారు.ఇటీవల పనులు నాణ్యతగా లేకపోవడంతో ప్రజలు అడ్డుకున్నారు. నేటికీ హడావుడిగా సాగుతూనే ఉన్నాయి. కొవ్వూరు మునిసి పాలిటీలో సీసీ రోడ్ల కోసం హడావుడిగా టెండర్లు పిలిచి వర్క్ ఆర్డర్లు కాంట్రాక్టర్ల చేతిలో పెట్టారు. కానీ బిల్లులు వస్తాయన్న నమ్మకం లేక పనులు ప్రారంభం కాలేదు. అనపర్తిలో రూ.2-5 లక్షల విలువ చేసే చిన్న చిన్న రోడ్లు, సీసీ రోడ్లు వేసి శిలాఫలకాలు పెట్టుకున్నారు. నాలుగేళ్ల కిందట శిలాఫలకాలు వేసిన చోటే మళ్లీ వేసి కొత్త సంస్కృతికి తెరతీశారు. దాదాపుగా ప్రతి వీధిలో గత రెండు నెలలుగా శిలాఫలకం ఏర్పాటు చేస్తున్నారు. ఒక్కోచోట శిలాఫలకం కోసమే పని చేశారా!? అనే చందంగా ఉండడంతో జనం నవ్విపోతున్నారు. కొత్తూరు, దుప్పలపూడి జగనన్న కాలనీల్లో తమ ఇష్టానుసారం వీధులకు వైసీపీ నాయకుల పేర్లు పెట్టి ప్రచార యావను చాటుకున్నారు.రాజానగరం నియోజకవర్గంలో వెలుగుబంద, కానవరంలో గృహాలకు కేటాయించిన భూములకు సంబంధించి కోడ్ వచ్చే ముందు రోజు రాత్రి రైతుల ఖాతాల్లో హడావుడిగా నగదు జమ చేశారు.కలవచర్లలో పారిశ్రామికవాడ పరిస్థితీ అంతే.కోడ్ ముందు రోజు హడావుడిగా శిలాఫలకం వేసి రిబ్బను కత్తిరించారు. అక్కడ పనులు ఎప్పుడు మొదలవుతాయో మరి. నిడదవోలు గణపతి థియేటర్ దగ్గర ఐ లవ్ నిడదవోలు అంటూ రుడా నిధులతో ఆధు నికీకరణ పనులు చేపట్టారు. కోడ్ వచ్చే హడావుడిలో పనులు పూర్తి కాకుండానే ప్రారంభోత్సవం చేసి ఆపై గాలికొదిలేశారు. గణేశ్‌చౌక్ సెంటర్ నుంచి ఓవర్ బ్రిడ్జి వరకూ ఫుట్‌పాత్‌ల నిర్మాణానికి శిలాఫలకం వేసేసి వది లేశారు.ఇలా అక్కడా ఇక్కడా అని ఏముంది.. అన్ని చోట్లా నాలుగన్నరేళ్లుగా లేనిది నేడు శిలాఫలకాలు దర్శనమిస్తున్నాయి.. ఎన్నికల వేళ అధికార వైసీపీ.. చీఫ్ ట్రిక్స్ బయటపడుతున్నాయి.



చివరిలో ఇలా : రాజమహేంద్రవరం జాంపేట నుంచి దానవాయిపేటకు ఇటీవలే వేసిన సిమెంట్ రోడ్డు



వంతెనకు డిజైన్ లేదు.. టెండర్ లేదు..
అయినా వెలిసిందీ!
నిడదవోలులో ఇదీ తీరు..

నిడదవోలు, ఏప్రిల్ 1 : ఆలూ లేదు.. చూలూ లేదు కొడుకు పేరు సోమలింగం అన్న నానుడి వైసీపీ ప్రజాప్రతినిధులకు అచ్చుగుద్దినట్టు సరిపోతుంది. ఎందుకంటే ఎన్నికల వేళ పనులు అధికారికంగా ఖరారు కాకపోయినా.. ఎక్కడికక్కడ శిలాఫలకాలు మాత్రం దర్శనమిస్తున్నాయి.ఈ సంఘటనే అందుకు ఉదాహరణ.. నిడదవోలు పట్టణంలోని చిన కాశీరేవు వద్ద అప్పారావు ఛానల్‌పై మార్టేరు-ప్రక్కిలంక రహ దారికి అనుసంధానంగా వేసిన గడ్డర్ బ్రిడ్జి కొట్టుకు పోయింది. కొత్త బ్రిడ్జికి ప్రతిపాదనలు వెళ్లాయి. డిజైన్ ఖరారు కాకుండానే శిలాఫలకం వేసి శంకుస్థాపన చేయడం విచిత్రానికి పరాకాష్టగా నిలుస్తోంది. నాలు గేళ్లుగా గుర్తుకురాని ఆ వంతెన ఎన్నికల వేళ హఠాత్తుగా గుర్తొచ్చేసింది.ఈ నెల 15వ తేదీన ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అట్టహాసంగా శంకుస్థాపన చేసేశారు. సుమారు రూ.4.65 కోట్ల అంచనాలతో పనులు ప్రారంభిస్తున్నట్టు శిలాఫలకం ఆవిష్కరించారు. అయితే అసలు తేడా ఇక్కడే ఉంది.వంతెన నిర్మాణానికి సంబంధించి నేటికి వంతెన డిజైన్ అధికారికంగా ఖరారు కాలేదు. టెండర్ దశకు వెళ్లలేదు. అలాంటిది నిడదవోలు ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడు శంకుస్థాపన చేసేశారు. ఎమ్మెల్యే ప్రజలను మభ్యపెడుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ అధికారులు సైతం డిజైన్ ఖరారుకాకుండా టెండర్ దశకు వెళ్లని పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేయడంపై విస్తుపోతున్నారు. ఒకవేళ డిజైన్ ఖరారై టెండరు దశ పూర్తయితే నేటికీ పనులు ఎందుకు ప్రారంభం కాలేదంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

పింఛన్ల సొమ్మేది?

- ఇంకనూ బ్యాంకు ఖాతాలకు చేరని రూ.75 కోట్లు
- జిల్లాలో 2.45 లక్షల మంది లబ్ధిదారులు

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

అధికార వైసీపీ ప్రభుత్వం ఎన్నికల సమయంలో పింఛన్‌దార్లను ఇబ్బందుల పాలు చేస్తోంది. ఒకటవ తేదీన ఇవ్వవలసిన పింఛన్‌ను 3వ తేదీ నుంచి 8వ తేదీ వరకూ ఇస్తామని ప్రకటించిన సంగతి తెలిసిందే. కానీ ఇప్పటి వరకూ ప్రభుత్వం సొమ్ము రిలీజ్ చేయలేదు. జిల్లాలో 2.45 లక్షల మంది పింఛన్ లబ్ధిదారులు ఉన్నారు. పింఛనుదారులకు మొత్తం రూ.75 కోట్ల సొమ్ము పంపిణీ చేయాల్సి ఉంది. ఒకటో తేదీ వెళ్లినా సొమ్ము ఇంకా జమకాలేదు. 3వ తేదీ ఉదయానికి వచ్చే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.పింఛన్ సొమ్ము జిల్లాలోని సంబంధిత బ్యాంక్‌లకు జమకావలసి ఉంది.ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లా యంత్రాంగం సచివాలయ ఉద్యోగులతో ఎన్నికలయ్యే వరకూ పంపిణీ చేయించడానికి నిర్ణయించిన సంగతి తెలిసిందే. గ్రామ సెక్రటరీ కానీ, వెల్ఫేర్ అసిస్టెంట్‌కానీ బ్యాంక్‌కు వెళ్లి డబ్బు డ్రా చేయాలి.ఈ మేరకు ఆయా ఎంపీడీవోలు లెటర్లు ఇవ్వనున్నారు.ఒక్కో సచివాలయం పరిధిలో రూ.10 లక్షల వరకూ పింఛన్ల సొమ్ము ఉంటుంది. 2వ తేదీ మం గళవారం కూడా సొమ్మురాకపోతే మూడో తేదీ ఉదయం నుంచి పింఛన్ల పం పిణీ కష్టమే. ఒక వేళ మూడోతేదీన ప్రభుత్వం రిలీజ్ చేసినా ఆయా సచివాల యాల పరిధిలో ఉద్యోగులు బ్యాంక్‌ల నుంచి డ్రా చేయడానికి సమయం పడు తుంది. అందువల్ల 3న కూడా పింఛన్లు అందుతాయో లేదో చెప్పలేని పరిస్థితి ఏర్పడింది.

నేటి నుంచి ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం

రాజమహేంద్రవరం రూరల్ ఏప్రిల్ 1 : జిల్లాలో మంగళవారం నుంచి 6 మండలాల్లో 87 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తామని జేసీ తేజ్‌భరత్ తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో పౌర సరఫరాల, అనుబంధ శాఖల అధికారులతో రబీ సీజనులో ధాన్యం సేకరణపై సోమవారం సమీక్షించారు. ప్రస్తుత రబీ సీజనులో జిల్లాలో 3.20 లక్షల టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా నిర్దేశించాన్నారు. జిల్లాలో 229 ఆర్‌బీకేల ద్వారా మంగళవారం నుంచి ధాన్యం సేకరణ ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు కార్యాచరణ సిద్ధం చేశామన్నారు. తొలి దశలో చాగల్లు, దేవరపల్లి, కొవ్వూరు, తాళ్లపూడి, నిడదవోలు, రంగపేట, మండలాల్లో 87 కొనుగోలు కేంద్రాల ద్వారా మంగళవారం నుంచి సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు.



ఓటుపై అవగాహన ర్యాలీ ప్రారంభిస్తున్న కలెక్టర్ మాధవీలత

ఓటుపై అవగాహనకు ర్యాలీ

రాజమహేంద్రవరం రూరల్ ఏప్రిల్ 1 : ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కె.మాధవీలత పిలుపునిచ్చారు. మే 13వ తేదీన జరగనున్న సార్వత్రిక ఎన్నికలను పురస్కరించుకుని ఓటర్లకు అవగాహన కల్పించే దిశగా రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి జేసీ తేజ్‌భరత్ ఏర్పాటు చేసిన బైక్ ర్యాలీని జిల్లా కలెక్టర్ మాధవీలత, ఎస్పీ పి.జగదీశ్ ప్రారంభించి మాట్లాడారు. జిల్లావ్యాప్తంగా 7 నియోజకవర్గాల్లో 16.50 లక్షల మంది ఓటర్లు ఉన్నారన్నారు. గత ఎన్నికల్లో పోలింగ్ శాతం పరిశీలిస్తే రూరల్‌లో ఎక్కువ అర్బన్‌లో తక్కువ శాతం పోలింగ్ నమోదైందన్నారు.గత ఎన్నికల్లో జిల్లాలో 76 శాతం పోలింగ్ నమోదు కాగా రూరల్‌లో 72 శాతం మాత్రమే పోలింగ్ నమోదైందని జేసీ తేజ్ భరత్ అన్నారు. ఓటరు నమోదు ప్రక్రియపై నిర్వహించిన బైక్ ర్యాలీలో బీయల్‌వోలు, రెవెన్యూ, సివిల్ సప్లై, పంచాయతీరాజ్, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

తూర్పుగోదావరి
• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి
• కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం
ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

అసంఘటిత కార్మికులపై నిర్లక్ష్యం

ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి గ్రీష్మకుమార్



నిడదవోలులో ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ యూనియన్ సమావేశం

నిడదవోలు, ఏప్రిల్ 1: ప్రభుత్వాలు అసంఘటిత రంగ కార్మికులను నిర్లక్ష్యం చేశాయని ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఈమని గ్రీష్మకుమార్ అన్నారు. నిడదవోలులో సోమవారం జరిగిన ఐఎఫ్‌టీయూ అనుబంధ సంస్థ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ వర్కర్స్ యూనియన్ సర్వ సభ్య సమావేశానికి ఆయన విచ్చేసి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర పాలకులు అనుసరించిన విధానాల ఫలితంగా దేశంలో నిరుద్యోగం పెరిగిపోయిందన్నారు. దీని కారణంగా అత్యధికంగా అసంఘటిత రంగంలో శ్రమజీవులు జీవనోపాధి పొందుతున్నారన్నారు. వీరి కోసం అసంఘటిత కార్మిక సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని ఎన్ని పోరాటాలు చేసినా ఫలితం లేదన్నారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు పామర్తి సత్యనారాయణ, మల్లిడి వెంకటరామిరెడ్డి, వెలిగట్ల శ్రీనివాసరావు, కిల్లాని గోపాల్, షేక్ హుస్సేన్, అహ్మద్ అలీ పాల్గొన్నారు.

కొవ్వూరులో విరిగిన విద్యుత్ స్తంభం



తప్పిన పెను ప్రమాదం

కొవ్వూరు, ఏప్రిల్ 1: ప్రమాదవశాత్తూ విద్యుత్తు స్తంభం విరిగి రోడ్డుపై పడింది. సోమవారం తెల్లవారుజామున 2వ వార్డులో క్రిస్టియన్‌పేట ప్రాథమిక పాఠశాల వద్ద ట్రాన్స్‌ఫారం పక్కనున్న స్తంభం విరిగి పడి పెద్ద శబ్దం వచ్చింది. దీంతో పాఠశాల పైభవనంలో ఉంటున్న బీసీ హాస్టల్ విద్యార్థులు భయాందోళనకు గురయ్యారు. రాత్రి నుంచి వినాయకుని గుడి వెనుక వీధిలో విద్యుత్ సరఫరా నిలుపుదల చేశారు. ఉదయం నుంచి విద్యుత్ శాఖ అధికారులు మరమ్మతులు చేపట్టారు. దీనిపై టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి పెనుమాక జయరాజు మాట్లాడుతూ రాత్రి విద్యుత్ స్తంభం పడిపోయిందని, అదే పగటి సమయంలో పడితే పెను ప్రమాదం జరిగేదని అన్నారు.

ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ

కొవ్వూరు, ఏప్రిల్ 1: కొవ్వూరు గోష్పాదక్షేత్రంలోని సుందర గోవిందుని గోశాలలో కార్యసిద్ధి ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ సోమవారం ఘనంగా జరిగింది. ఆలయ వ్యవస్థాపకులు పారుపూడి సూర్యరామ సుబ్రహ్మణ్య దంపతులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సుందర గణపతి, 11 అడుగుల ఆంజనేయ స్వామి విగ్రహాలను శాస్త్రోక్తంగా ప్రతిష్ఠించారు. కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

వేంకటేశ్వరుడి ఆలయంలో పునఃప్రతిష్ఠోత్సవాలు

కొవ్వూరు, ఏప్రిల్ 1: కొవ్వూరులోని బసివిరెడ్డిపేటలో శ్రీ రాజ్యలక్ష్మీ గోదా సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ జీర్ణోద్ధరణ పునఃప్రతిష్ఠోత్సవాలు రెండో రోజు సోమవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ద్వార తోరణ ధ్వజ కుంభ ఆరాధనలు, ధ్వజస్తంభ, కుంభ స్థాపనలు, అగ్ని ప్రతిష్ఠాపన, విశేష హోమాలు, గోపూజ, నిత్య పూర్ణాహుతి, వేద విన్నపాలు, విష్ణుసహస్ర నామ పారాయణం జరిపారు. కార్యక్రమంలో దేవగుప్తాపు లక్ష్మణరావు, ఆలయార్చకులు గొడవర్తి సత్యనారాయణాచార్యులు, వేణుగోపాలచార్యులు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

కేంద్ర బలగాల కవాతు



మార్కొండపాడులో కేంద్ర బలగాలతో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

చాగల్లు, ఏప్రిల్ 1: రాబోయే సాధారణ ఎన్నికల్లో ప్రజలు స్వేచ్ఛగా, నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరుతూ మండలంలోని బ్రాహ్మణగూడెం, దారవరం, మార్కొండపాడు గ్రామాల్లో కేంద్ర బలగాలతో పోలీసులు కవాతు నిర్వహించారు. సీఐ శ్రీనినవాసరావు ఆధ్వర్యంలో జరిగిన కవాతులో ఎస్ఐ పి.నాగరాజు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నవోదయకు ముగ్గురి ఎంపిక

దేవరపల్లి/పెరవలి, ఏప్రిల్ 1: నవోదయ పాఠశాలలో ప్రవేశానికి ముగ్గురు విద్యార్థులు ఎంపికైనట్టు ఎంఈవోలు తిరుమలదాసు, కేఆర్ఎస్‌వీవీ అప్పారావు తెలిపారు. మండలంలోని దేవరపల్లి ప్రాథమిక పాఠశాలకు చెందిన తంగెళ్ళ యశస్విని, గాంధీనగరానికి చెందిన ఉండవల్లి మోక్షితాదేవి, దుద్దుకూరు పాఠశాలకు చెందిన కడిమి గుణశేఖర్ ఎంపికైనట్టు ఎంఈవోలు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులతోపాటు వారికి శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులకు అభినందనలు తెలిపారు. అలాగే పెరవలి మండలం ముక్కామల పంచాయతీ పరిధిలోని గవర్లపాలెం ప్రాథమిక పాఠశాల విద్యార్థి జి.మోహన్ సిద్ధి నవోదయ పాఠశాలలో ప్రవేశానికి ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా విద్యార్థితోపాటు హెచ్ఎం వెలగల సూర్యభాస్కరరెడ్డి, ఉపాధ్యాయుడు ప్రసాద్‌బాబులను ఎంఈవో బాలసుబ్రహ్మణ్యం స్వరూప్, షేక్ నూర్జహాన్ అభినందించారు.

లారీ కార్మికుల వేతన ఒప్పంద చర్చలు విఫలం

కొవ్వూరు, ఏప్రిల్ 1: లారీ కార్మికుల వేతన ఒప్పంద చర్చలు విఫలమయ్యాయి. కొవ్వూరు మండలం పంగిడి, దేవరపల్లి మండలం దుద్దుకూరులలో క్వారీ లారీలపై పనిచేస్తున్న కార్మికులు వేతన ఒప్పందం కోసం పది రోజులుగా సమ్మె బాట పట్టారు. గతంలో చేసుకున్న వేతన ఒప్పందం 2024 మార్చి 9వ తేదీతో ముగిసింది. తిరిగి వేతన ఒప్పందం కోసం నెల రోజుల క్రితం యాజమాన్య సంఘాలకు ఐఎఫ్‌టీయూ, ఐఎన్‌టీయూసీ, పీకేఎస్ సంఘాల ఆధ్వర్యంలో డిమాండ్ నోటీసులు అందించారు. మార్చి 22న క్వారీ అండ్ క్రషర్ యాజమాన్యం వేతనాలపై రూ.3400 పెంచి వేతన ఒప్పందం చేసుకుంది. సింగిల్ లారీ యజమానులు వేతనాలు పెంచడానికి నిరాకరించారు. దీనిపై కొవ్వూరు ఆర్డీవో, అసిస్టెంట్ లేబర్ కమిషనర్‌ను కార్మిక సంఘాల నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. సోమవారం కార్మిక సంఘాలకు, యజమానులకు అసిస్టెంట్ లేబర్ కమిషనర్ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేయగా యజమానులు వేతనాలు పెంచడానికి అంగీకరించకపోవడంతో చర్చలు విఫలమయ్యాయి. కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు రమేష్, నాగేశ్వరరావు, దుర్గారావు, నాగరాజు, మస్తాన్, ఆకాష్, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

కులం పేరుతో దూషించిన భర్తపై కేసు

కొవ్వూరు, ఏప్రిల్ 1: భార్యను కులం పేరుతో దూషించిన భర్తపై కేసు నమోదు చేసినట్టు సీఐ వి.జగదీశ్వరరావు తెలిపారు. కొవ్వూరులోని క్రిస్టియన్‌పేటకు చెందిన పాశం ఉష తండ్రి కోర్టు వాద్యమును అడ్డుగా పెట్టుకుని పాశం రవిశంకర్ తరచుగా ఇంటికి వస్తూ 29 ఏళ్ల క్రితం మైనర్ అయిన ఉషతో పరిచయం పెట్టుకున్నాడు. ఇంట్లో ఎవ్వరూలేని సమయంలో అవసరం తీర్చుకుని పెళ్లి చేసుకుంటానని చెప్పి నమ్మించాడు. కొన్నేళ్ల వరకు పెళ్లిని వాయిదా వేస్తూ వస్తుండడంతో ఉష బంధువులు రవిశంకర్‌ను నిలదీశారు. దీంతో 2018లో వేములూరు సాయిబాబా గుడిలో ఉషను పెళ్లి చేసుకున్నాడు. వీరికి ఒక బాబు పుట్టాడు. ఆపై భార్యను నానా బాధలు పెడుతూ బిడ్డకు పోషణ ఇవ్వకుండా భార్యను వదిలిపెట్టాడు. ఈ ఏడాది మార్చి 19న రవిశంకర్‌ను ఉష బంధువులు కోర్టు వద్ద నిలదీయగా అది నిజమైన పెళ్లి కాదని, కులం పేరుతో దూషించినట్టు ఉష పోలీసులకు ఫిర్యాదు చేసింది.

కడుపునొప్పి తాళలేక వివాహిత ఆత్మహత్య

తాళ్లపూడి, ఏప్రిల్ 1: కడుపునొప్పి తాళలేక మండలంలోని తిరుగుడుమెట్ట గ్రామానికి చెందిన వివాహిత సైదు భాగ్యశ్రీ(24) ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసుల వివరాల ప్రకారం.. తిరుగుడుమెట్టకు చెందిన సైదు సాయిబాబాతో దేవరపల్లి మండలం త్యాజంపూడికి చెందిన భాగ్యశ్రీకి 2018లో వివాహమైంది. వారికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. సాయిబాబా ఉద్యోగం నిమిత్తం గల్ఫ్ వెళ్లగా భాగ్యశ్రీ అత్తింటిలోనే ఉంటోంది. ఆమె కొన్నాళ్లుగా కడుపునొప్పితో బాధపడుతోందని, నొప్పి తాళలేక సోమవారం ఉరి వేసుకుందని మృతురాలి పెద్దమ్మ లక్ష్మీ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ శ్యాంసుందర్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించినట్టు చెప్పారు.

రాజమండ్రి లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థిగా గిడుగు



రాజమహేంద్రవరం, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): రాజమండ్రి లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థిగా పీసీసీ మాజీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజును అధిష్ఠానం ఖరారు చేసింది. రేపోమాపో అధికారికంగా ప్రకటించనున్నారు. అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం ప్రాంతానికి చెందిన రుద్రరాజు కాంగ్రెస్‌లో సీనియర్ నేత. వైఎస్ షర్మిలారెడ్డి పీసీసీ ప్రెసిడెంట్ అయ్యే వరకూ ఆయనే కొనసాగారు. ఇంతవరకూ కూటమి, వైసీపీ మధ్యనే లోక్ సభలో పోటీ ఉంటుందని అంతా భావించారు. రుద్ర రాజు కొంత మేరకైనా ప్రభావం చూపగలరనే వాదన ఉంది.

హోం ఓటింగ్ ఓటర్ల వివరాలివ్వండి

- 12డి ఫారంపై అంగీకార పత్రాలు తీసుకోండి
- 11,334 మంది ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం
- కొవ్వూరు సబ్ కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాస్తవ
- ఎన్నికల సిబ్బందికి ఓరియంటేషన్ కార్యక్రమం



బీఎల్‌వోలకు అవగాహన కల్పిస్తున్న సబ్ కలెక్టర్ శ్రీవాస్తవ

కొవ్వూరు, ఏప్రిల్ 1: కొవ్వూరు నియోజకవర్గంలో హోం ఓటింగ్‌కు సానుకూలంగా ఉన్న ఓటర్ల వివరాలను 3 రోజుల్లో ఆర్వో కార్యాలయంలో అందజేయాలని కొవ్వూరు సబ్ కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాస్తవ అన్నారు. కొవ్వూరు నందమూరు రోడ్‌లోని కళ్యాణ మండపంలో సోమవారం ఫారం-12డి, 85 ఏళ్ల వయస్సు పైబడిన ఓటర్ల కోసం బీఎల్‌వోలు, సెక్టార్ ఆఫీసర్, సూపర్‌వైజర్స్‌కు ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించి అవగాహన కల్పించారు. సబ్ కలెక్టర్ మాట్లాడుతూ బీఎల్‌వోలు, సెక్టారు అధికారులు సంయుక్తంగా హోం ఓటింగ్ ఓటర్ల ఇంటింటికీ వెళ్లి ధ్రువీకరణ పత్రాలు స్వీకరించాలన్నారు. హోం ఓటింగ్ కావాలో వద్దో హామీపత్రం తీసుకోవాలన్నారు. ఓటర్లు లిస్టులో నమోదైన వయస్సు ఆధారంగా తీసుకుని 85 ఏళ్లు పైబడిన ఓటర్లు, హోం ఓటింగ్ కావాలనే వారు, సదరం సర్టిఫికెట్‌లో 40శాతం పైబడి దివ్యాంగత్వం ఉన్న వారి నుంచి 12డి ఫారంపై అంగీకార పత్రాలు తీసుకుని ఆర్వో కార్యాలయానికి నివేదిక అందజేయాలన్నారు. వారందరికీ ఇంటి వద్దనే ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పిస్తామన్నారు. హోం ఓటింగ్‌కు నోడల్ ఆఫీసర్‌గా మున్సిపల్ కమిషనర్ కె.డానియల్ జోసఫ్‌ను నియమించారు. నియోజకవర్గంలో 176 పోలింగ్ కేంద్రాల్లో 85 ఏళ్లు పైబడిన ఓటర్లు 8281, 40శాతం దివ్యాంగత్వం పైబడిన ఓటర్లు 19690 మంది ఉన్నట్టు గుర్తించినట్టు సబ్‌కలెక్టర్ తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో భాగస్వామ్యమయ్యే పీవోలు, అనుబంధ సిబ్బంది, రిజర్వు సిబ్బంది 11334 మంది ఉద్యోగులకు పోస్టల్‌బ్యాలెట్ సౌకర్యం కలుగజేయనున్నామన్నారు. వారి నుంచి ఫారం 12 ద్వారా డిక్లరేషన్ పొందవలసి ఉందన్నారు. మొదటి శిక్షణా కార్యక్రమంలో ఆ మేరకు చర్యలు తీసుకోవాలన్నారు. పోస్టల్‌బ్యాలెట్, ఆబ్సెంటీ ఓటింగ్‌పై కేంద్ర ఎన్నికల కమీషన్ నిబంధనలపై పీపీటీ ద్వారా శిక్షణ ఇవ్వనున్నట్టు చెప్పారు. సార్వత్రిక ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెరిగేలా సిబ్బంది కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో ఏఈఆర్వోలు కొవ్వూరు, చాగల్లు, తాళ్లపూడి తహశీల్దార్లు కె.మస్తాన్, ఎం.సావిత్రి, సీహెచ్ శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ డానియల్ జోసఫ్, 17 మంది సెక్టార్ అధికార్లు, 17 మంది సూపర్‌వైజర్లు, 176 మంది బీఎల్‌వోలు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

అసమర్థ, అవినీతి ప్రభుత్వాన్ని తరిమికొట్టండి

- కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం
- టీడీపీ-జనసేన-బీజేపీ నిడదవోలు అభ్యర్థి దుర్గేష్



పెరవలి: సమావేశంలో మాట్లాడుతున్న కందుల దుర్గేష్

పెరవలి, ఏప్రిల్ 1: రాష్ట్రంలోని అసమర్థ అవినీతి ప్రభుత్వాన్ని తరిమి కొట్టడానికి అందరూ కలిసకట్టుగా పనిచేయాలని టీడీపీ-జనసేన-బీజేపీ నియోజకవర్గ అభ్యర్థి కందుల దుర్గేష్, టీడీపీ ఇన్‌చార్జి బూరుగుపల్లి శేషారావు పేర్కొన్నారు. తీపర్రులో సోమవారం సాయంత్రం నిర్వహించిన పార్టీ కార్యకర్తల పరిచయ సమావేశంలో దుర్గేష్ మాట్లాడుతూ గతంలో ఎమ్మెల్యేగా పని చేసిన శేషారావు నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశారని అదే బాటలో పయనించి నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో ఉండేలా కృషి చేస్తానన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రం అస్తవ్యస్తంగా మారిందని కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు అతికాల రామకృష్ణమ్మ, పిప్పర రవి, అబ్బిశెట్టి సత్తిరాజు, కంటిపూడి సూర్యనారాయణ, కరుటూరి సుబ్బారావు, నల్లాకుల వెంకటేశ్వరరావు, పులుసు సౌజన్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేవరపల్లి గిద్దయ్య.. శేషారావు, దుర్గేష్‌లను సత్కరించారు. పెరవలిలో జరిగిన మండల ఎలక్ట్రిషియన్ అండ్ ప్లంబర్స్ సమావేశానికి కందుల దుర్గేష్ ముఖ్యఅతిథిగా విచ్చేసి వారి సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

నిడదవోలు: నిడదవోలులోని 5వ వార్డులో కందుల దుర్గేష్, బూరుగుపల్లి శేషారావు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పించారు. సార్వత్రిక ఎన్నికల్లో దుర్గేష్‌కు గ్లాసు గుర్తుపై ఓటు వేసి విజయం చేకూర్చాలని శేషారావు అన్నారు.అధికారంలోకి రాబోయేది కూటమి ప్రభుత్వమేనని, వచ్చిన వెంటనే నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నిలుపుతానని దుర్గేష్ అన్నారు. కార్యక్రమంలో కొమ్మిన వెంకటేశ్వరరావు, రంగా రమేష్, నీలం రామారావు, తిరుపతి సత్యనారాయణ, నాని, బలిజేపల్లి సూర్యనారాయణమూర్తి, కొండా నిర్మల పాల్గొన్నారు.

జగన్‌వి స్వార్థ రాజకీయాలు : ముప్పిడి

చాగల్లు, ఏప్రిల్ 1: సీఎం జగన్‌రెడ్డి స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం ఒకటో తారీఖున జరగవలసిన పెన్షన్‌ల పంపిణీ ఆలస్యమైందని టీడీపీ-జనసేన-బీజేపీ నియోజకవర్గ అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు విమర్శించారు. సోమవారం నెలటూరులో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పెన్షన్ల పంపిణీ ఆలస్యం కావడానికి టీడీపీ నాయకులే కారణమంటూ వైసీపీ నాయకులు, మంత్రులు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని ఆయన ఖండించారు. జగన్ ఎన్నికల కోడ్‌కు విరుద్ధంగా పింఛను సొమ్ముతో పాటు ప్రభుత్వ నిధులు రూ.13 వేల కోట్లు కాంట్రాక్టర్లకు దోచిపెట్టారని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రూ.4 వేలు వంతున పింఛన్లు ఇంటి వద్దకే అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ ఛైర్మన్ ఆళ్ల హరిబాబు, కేతా సాహెబ్, రాష్ట్ర కమల మిత్ర కన్వీనర్ భువనేశ్వరి, జనసేన నాయకుడు కొప్పాక విజయకుమార్ మాట్లాడుతూ పింఛన్ల పంపిణీపై వైసీపీ చేస్తున్న ప్రచారాన్ని ఖండించారు. ఇదిలా ఉండగా బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా ముప్పిడి వెంకటేశ్వరరావు మండలంలోని గౌరిపల్లి, మల్లవరం, నెలటూరు గ్రామాల్లో పర్యటించారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఎన్నికల్లో కొవ్వూరు అసెంబ్లీ అభ్యర్థిగా తనను, ఎంపీ అభ్యర్థిగా పురందేశ్వరిని గెలిపించాలని కోరుతూ ప్రచారం నిర్వహించి కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాదెళ్ల శ్రీరామ్, కోడూరి కాశిగంగాధరరావు, తాళ్లూరి హరిశ్చంద్రప్రసాద్, యడ్లపల్లి రకారావు, ఈదుపుగంటి మురళి, దొంగ రామకృష్ణ, నందిగం శ్రీను, బీజేపీ నాయకులు తాళ్లూరి వరప్రసాద్, కంచుమర్తి సుబ్బారావు పాల్గొన్నారు.

కూటమి విజయం ఖాయం : మద్దిపాటి

దేవరపల్లి, ఏప్రిల్ 1: రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలో కూటమి అభ్యర్థులు విజయం సాధిస్తారని ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణస్వీకారం చేస్తారని నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. మండలంలోని బుచ్చయ్యపాలెం, అచ్చయ్యపాలెం, కొత్తగూడెం గ్రామాల్లో ఆయన ఇంటింటా ప్రచారం నిర్వహించి, సూపర్ 6 పథకాల కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైసీపీ రాక్షస పాలనకు చరమగీతం పాడే రోజులు దగ్గరలో ఉన్నాయని, చంద్రన్న రామరాజ్య పాలన కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గన్నమని హరికృష్ణ, యాగంటి వెంకటేశ్వరరావు, ఉప్పులూరి రాంబాబు, కాట్రు భీమరాజు, కొండపల్లి దొరయ్య, కేవీవీ సత్యనారాయణ, జనసేన నాయకులు అడబాల మణికంఠ, కంబాల సత్తిబాబు పాల్గొన్నారు.

నల్లజర్ల: నల్లజర్ల టీడీపీ కార్యాలయంలో స్థానిక విలేకర్లతో మద్దిపాటి వెంకట్రాజు మాట్లాడుతూ జగన్‌రెడ్డి పింఛను సొమ్ముతో పాటు ప్రభుత్వ నిధులు రూ.13వేల కోట్లు మార్చి 15 నుంచి 30 తేదీ మధ్యలో ఎన్నికల కోడ్‌కు విరుద్ధంగా సొంత కాంట్రాక్టర్లకు దోచిపెట్టారని, రాష్ట్ర ఖజానాలో నిధులు లేకపోవడంతో ఈ నెల 1న పింఛను ఇవ్వకుండా టీడీపీపై బురద జల్లే కుట్ర చేశారని మద్దిపాటి పేర్కొన్నారు. జగన్ స్వార్థ రాజకీయం వల్లే పింఛనుదారులు, వలంటీర్లు నష్టపోయారన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే ఇంటి వద్దకే నెలకు రూ.4 వేలు పింఛను అందిస్తుందన్నారు.



చాగల్లు: నెలటూరులో ప్రచారం నిర్వహిస్తున్న ముప్పిడి తదితరులు



దేవరపల్లి: అచ్చయ్యపాలెంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న మద్దిపాటి

9 నుంచి ధాన్యం కొనుగోళ్లు

గోపాలపురం తహశీల్దార్ వనజాక్షి

గోపాలపురం, ఏప్రిల్ 1: రబీ సీజన్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఈ నెల 9వ తేదీ నుంచి ప్రారంభిస్తున్నట్టు తహశీల్దార్ పి.వనజాక్షి తెలిపారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో మొదటి మైత్రీ కమిటీ సమావేశం సోమవారం నిర్వహించారు. రబీ సీజన్‌లో ధాన్యం కొనుగోలు, తనిఖీల్లో వచ్చిన మార్పులు, పాటించాల్సిన విధి విధానాలపై వివరించారు. ముఖ్యంగా ధాన్యం రవాణా చేసే వాహనాలకు జీపీఎస్‌ను తప్పనిసరిగా అమర్చాలన్నారు. ధాన్యం కొనుగోలు సమయంలో ఏ శాఖ ఏఏ బాధ్యతలు నిర్వహించాలో, అదే సమయంలో ఉత్పన్నమవుతున్న సమస్యలు వ్యవసాయాధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో కస్టోడియన్ అధికారులు, కంట్రోల్‌రూమ్ సిబ్బంది, గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహాయకులు, సొసైటీ కార్యదర్శులు, వ్యవసాయాధికారి రాజారావు, ట్రైనీ కలెక్టర్ అరుణ పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్

చాగల్లు, ఏప్రిల్ 1: రంజాన్ మాసంలో ముస్లింలు ఇచ్చే ఇఫ్తార్ విందు మత సామరస్యానికి ప్రతీక అని కూటమి నియోజకవర్గ అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం ఇస్లామ్‌పేటలోని షాదీఖానాలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొని మాట్లాడారు. ముస్లింల సంక్షేమానికి చంద్రబాబు నాయకత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. అందరికీ రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే టీవీ రామారావు, ఆళ్ల హరిబాబు, కేతా సాహెబ్, దొంగ రామకృష్ణ, ఉప్పులూరి చిరంజీవి, కొప్పాక విజయకుమార్, అల్తాఫ్ అహ్మద్, అల్తాఫ్ జానీ, సయ్యద్ అన్వర్‌బాషా పాల్గొన్నారు.

కొవ్వూరులో బైక్ చోరీ

కొవ్వూరు, ఏప్రిల్ 1: బైక్ దొంగతనంపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ జుబేర్ మహమ్మద్ తెలిపారు. కొవ్వూరు జగనన్నకాలనీ లేఅవుట్-2లో నివాసం ఉంటున్న కొటాన సన్యాసిరావు మార్చి 29వ తేదీన సాయంత్రం ఇంటి వద్ద బైక్ పార్క్ చేశాడు, ఉదయం లేచి చూసేసరికి కనిపించకపోవడంతో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వాహనాల తనిఖీల్లో రూ.1.20 లక్షలు సీజ్

గోపాలపురం, ఏప్రిల్ 1: మండలంలోని జగన్నాథపురం శివారులో ఏర్పాటు చేసిన అంతర్ జిల్లాల చెక్‌పోస్టు వద్ద ఎటువంటి బిల్లులు లేకుండా వాహనంలో తరలిస్తున్న రూ.1.20లక్షలు స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్టు ఎస్ఐ కె.సతీష్ తెలిపారు. కొయ్యలగూడెం వైపు నుంచి తాళ్లపూడి మండలానికి చెందిన నీలం వీరభద్రరావు బిల్లులు లేకుండా సొమ్ములు తీసుకెళ్తుండగా వాహనాల తనిఖీల్లో పట్టుబడిందని చెప్పారు.

తూర్పున ఇప్పటి వరకూ

రూ.28.89 లక్షలు సీజ్

- పట్టుబడిన వస్తువుల డేటా డిజిటలైజేషన్ చేయాలి
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాధవీలత

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లాలో ఇప్పటి వరకూ రూ.28,89,810 సీజ్ చేసినట్టు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా.కె.మాధవీలత తెలిపారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో సోమవారం ఎన్నికల నిర్బంధ వ్యవస్థ (ఈఎస్ఎంఎస్) పనితీరుపై సీజర్ నోడల్ ఏజెన్సీ అధికారులతో సమీక్షించారు. ఎన్నికల నేపథ్యంలో క్షేత్రస్థాయిలో సీజ్‌చేసిన నగదు, మద్యం, మాదక ద్రవ్యాలు, విలువైన మెటల్, ఉచితాలు, ఇతర వస్తువుల డేటాను ఎప్పటికప్పుడు డిజిటలైజేషన్ చేయాలన్నారు. అధిక మొత్తాలపై నిఘా పెట్టాలన్నారు. రైల్వే, రోడ్డు రవాణా ద్వారా ఎక్కువ తరలింపులు ఉంటాయని తెలిపారు. తూర్పుగోదావరి ప్రధాన రహదారిలో ఉండడం వల్ల ఇతర ప్రాంతాలకు ఈ రోడ్డు మార్గాన ఎన్నికల్లో పంపిణీకి వస్తువుల రవాణా జరుగుతుంటుందని చెప్పారు. జిల్లాకు వచ్చే కంటైనర్ల రికార్డులు పరిశీలించి నివేదికలు ఇవ్వాలని ఆదేశించారు. రూ.50 వేలు కంటే ఎక్కువ నగదు దగ్గర ఉంటే, ఆధారాలు చూపాలన్నారు. రాజమహేంద్రవరం అర్బన్‌లో ఇప్పటి వరకూ రూ.2 లక్షలు, అనపర్తిలో 1,27,860, నిడదవోలులో రూ.1.50,000, గోపాలపురంలో 1.20 లక్షలు రాజమహేంద్రవరం అర్బన్‌లో రూ.90 వేలు సీజ్‌చేశామన్నారు. సమావేశంలో జిల్లా సీజర్ నోడల్ అధికారి, జిల్లా ఆడిట్ అధికారి కేవీ.వెంకటేశ్వరావు సెబ్ అధికారులు పి.సోమశేఖర్, కె.జయమౌనిక, ఎల్‌డీఎం డివి ప్రసాద్, ఐటీ అధికారులు శీలం వీరబాబు, బీవీ సుబ్బారెడ్డి, రాష్ట్ర జీఎస్‌టీ, రైల్వే అధికారులు పాల్గొన్నారు.

ఏపీపీఎస్సీలో అవకతవకలపై పోలీసులకు ఫిర్యాదు

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): ఏపీపీఎస్సీలో జరిగిన అవకతవకలపై రాజమహేంద్రవరం పార్లమెంటు నియోజకవర్గ టీఎన్ఎస్ఎఫ్ ప్రతినిధులు త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు. సీఎం జగన్, ఏపీపీ ఎస్సీ ఛైర్మన్ గౌతమ్ సవాంగ్, రామకృష్ణారెడ్డి నేతృత్వంలో కుంభకోణానికి తెరతీశారని ఫిర్యాదులో ఆరోపించారు. ఎంతోమంది నిరుద్యోగులను అన్యాయం చేసి పోస్టులను అమ్ముకున్నారని విమర్శించారు. కొన్ని పోస్టులను వారి అనుయాయులకు కట్టబెట్టుకున్నారన్నారు. ఫిర్యాదు అందజేసిన వారిలో టీఎన్ఎస్ఎఫ్ నాయకుడు సాయిదీపక్ తదితరులున్నారు.

వలంటీర్ల సెల్‌ఫోన్లు స్వాధీనం

గోపాలపురం, ఏప్రిల్ 1: వలంటీర్ల నుంచి సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్టు ఎంపీడీవో కె.రమేష్ సోమవారం తెలిపారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు గోపాలపురం మండలంలో 274 మంది వలంటీర్లకు 261 మంది నుంచి సెల్‌ఫోన్లు, సిమ్‌కార్డులు స్వాధీనం చేసుకున్నామన్నారు. మిగిలిన వారు అందుబాటులో లేరని, త్వరలోనే వారి వద్ద నుంచి కూడా స్వాధీనం చేసుకుంటామన్నారు. పింఛన్ల పంపిణీపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తదుపరి కార్యాచరణ ప్రకటిస్తామన్నారు.

ప్రజాశాంతికి భంగం కలిగిస్తే చర్యలు

సౌత్‌జోన్ డీఎస్పీ అంబికా ప్రసాద్

కడియం, ఏప్రిల్ 1: పబ్లిక్ స్థలాల్లో దురుసు ప్రవర్తన, న్యూసెన్స్ చేస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని సౌత్‌జోన్ డీఎస్పీ ఎం అంబికా ప్రసాద్ తెలిపారు. కడియం దేవీసెంటర్‌లో ఆదివారం సాయంత్రం ఘర్షణకు పాల్పడి ప్రజాశాంతికి భంగం కలిగించే విధంగా ప్రవర్తించిన ఆకతాయిలకు కౌన్సిలింగ్, జగడం ఆడినందుకు కేసు నమోదు చేసినట్టు చెప్పారు. పోలీసుల వివరాల ప్రకారం కడియం సెంటర్‌లో కొందరు యువకులు చిన్న కారణంగా రెండు వర్గాలుగా విడిపోయి ఘర్షణకు పాల్పడి న్యూసెన్స్ చేశారు. స్థానికుల సమాచారంతో పోలీసులు అక్కడికి వెళ్ళడంతో కొంతమంది పరారయ్యారు. మరికొందరు తాము కాదంటూ పోలీసులతో వాదనకు దిగారు. ఎస్ఐ బీఎన్ దుర్గాప్రసాద్, పోలీసు సిబ్బంది కలిసి ఘటనకు పాల్పడిన 8 మంది యువకులను గుర్తించి, పెద్దల సమక్షంలో కౌన్సిలింగ్ ఇచ్చామన్నారు. అలానే బహిరంగ ప్రదేశంలో ఘర్షణకు పాల్పడినందుకు కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు. డీఎస్పీ ప్రసాద్ పర్యవేక్షించి, సీఐ తులసీధర్‌కు, పోలీసు సిబ్బందికి సూచనలు చేశారు.

సభలు, సమావేశాలకు అనుమతి తప్పనిసరి

ఈస్ట్‌జోన్ డీఎస్పీ కిషోర్‌కుమార్



రంగంపేట, ఏప్రిల్ 1:ముందస్తు అనుమతి లేకుండా సభలు, సమావేశాలు, ఊరేగింపులు వంటివి జరపడానికి వీల్లేదని ఈస్ట్‌జోన్ డీఎస్పీ ఎం.కిషోర్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఎన్నికల దృష్ట్యా సెక్షన్-30 అమలులో ఉందని, శాంతిభద్రతలకు భంగం కలగకుండా వ్యవహరించాలని అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు. లేని పక్షంలో క్రిమినల్ చర్యలు తీసుకుంటాని హెచ్చరించారు.

శహపురంలో 'న్యాయం కోసం నల్లమిల్లి'

అనపర్తి, ఏప్రిల్ 1: టీడీపీ, జనసేన, బీజేపీ పొత్తులో భాగంగా అనపర్తి అసెంబ్లీ సీటును కోల్పోయిన టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి చేపట్టిన న్యాయం కోసం నల్లమిల్లి కార్యక్రమం సోమవారం పెదపూడి మండలం శహపురంలో జరిగింది. తల్లి సత్యవతి, సతీమణి మహాలక్ష్మి, కుమారుడు మనోజ్‌రెడ్డి, కుమార్తె డాక్టర్ సనాతనితో కలిసి ఆయన గ్రామంలో పర్యటించారు. తన భవిష్యత్ ప్రణాళిక ప్రజల అభిప్రాయంతో ముడిపడి ఉందని, ఏమి చేయాలో వారే చెప్పాలంటూ ఇంటింటికీ వెళ్లి పరిస్థితిని వివరించారు. ఈ సందర్భంగా తన తల్లి సత్యవతిని రిక్షాలో కూర్చోబెట్టి తిప్పడంతో ప్రజల్లో విపరీతమైన సానుభూతి వ్యక్తమైంది. చంద్రబాబు అనపర్తి సీటును రామకృష్ణారెడ్డికే కేటాయిస్తారని, అధైర్య పడొద్దని గ్రామస్థులు మద్దతు పలికారు. ఈ సందర్భంగా నల్లమిల్లి మీడియాతో మాట్లాడుతూ అనపర్తిలో పార్టీని కాపాడుకోవడం ఎంత ముఖ్యమో తనను నమ్ముకున్న కార్యకర్తలను రక్షించుకోవడం కూడా అంతే ముఖ్యమన్నారు. ఇప్పటికైనా మూడు పార్టీల అధినేతలు పునరాలోచన చేసి సమర్థులైన వారికి టికెట్లు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కాలవలోకి దిగి యువకుడి మృతి

కడియం, ఏప్రిల్ 1: కడియం మండలం దామిరెడ్డిపల్లికి చెందిన రావిపాటి అయ్యప్ప(25) కడియపులంక కాలవలో స్నానానికి దిగి మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం అయ్యప్ప పూలు అమ్ముతుంటాడు. కడియపులంక పూలమార్కెట్‌కు వెళుతూ స్నానం కోసం కాలువలోకి దిగాడు. ప్రమాదవశాత్తూ మునిగిపోయి మృతి చెందాడు. స్థానికులు గమనించి సమాచారం అందించడంతో పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

భార్య మృతి కేసులో భర్తకు రెండేళ్ల జైలు

రాయవరం, ఏప్రిల్ 1: వేధింపులతో భార్య మృతికి కారణమైన నిందితుడికి రెండేళ్లు జైలు శిక్ష, జరిమానా విధిస్తూ రామచంద్రపురం అసిస్టెంట్ సెషన్స్ కోర్టు జడ్జి కె.వెంకటేశ్వరరావు తీర్పు చెప్పారని రాయవరం ఎస్ఐ జి.నరేష్ సోమవారం తెలిపారు. కడియం మండలం దుళ్ల గ్రామానికి చెందిన జక్కం దేవికి రాయవరానికి చెందిన పిచ్చుక బుల్లియ్యతో వివాహమైంది. కొంతకాలం తర్వాత బుల్లియ్య భార్య దేవిని మానసికంగా, శారీరకంగా వేధింపులకు గురిచేశాడని, అల్లుడు వేధింపుల వల్ల తన కుమార్తె ఆత్మహత్యకు పాల్పడిందని మృతురాలి తండ్రి జక్కం వీరవెంకట సత్యనారాయణ 2015లో పోలీసులు ఫిర్యాదు చేశాడు. అప్పటి ఎస్ఐ సురేష్‌బాబా కేసు నమోదు చేశారు. కోర్టులో వాదనలు అనంతరం ఈకేసులో ఏ1గా ఉన్న బుల్లియ్యకు రెండేళ్ల జైలు శిక్ష, రూ.5వేలు జరిమానా విధిస్తూ జడ్జి కె.వెంకటేశ్వరరావు తీర్పు చెప్పినట్టు ఎస్ఐ తెలిపారు. ఫిర్యాదుదారుడు తరపున పీపీ ఎంవీవీ సూర్యప్రకాష్ వాదనలు వినిపించారు.

గామన్ బ్రిడ్జిపై తవుడు లోడ్ లారీ దగ్ధం

కాలిబూడిదైన రూ.2.50 లక్షల విలువైన ముడిసరుకు

డ్రైవర్, క్లీనర్ సురక్షితం

దివాన్‌చెరువు, ఏప్రిల్ 1: రిఫండ్ ఆయిల్ తయారు చేసేందుకు ముడిసరుకు తీసుకువెళ్తున్న లారీ సోమవారం ప్రమాదవశాత్తూ దగ్ధమైంది. ఈ సంఘటనలో రూ.2.50 లక్షల విలువైన ముడిసరుకు కాలిబూడిదైందది. అయితే డ్రైవరు, క్లీనరు అప్రమత్తంగా వ్యవహరించడంతో పెనుప్రమాదం తప్పింది. బొమ్మూరు పోలీసుల వివరాల ప్రకారం.. నూనె తయారీకి ముడిసరుకు తవుడు లోడ్‌తో లారీ కలకత్తా నుంచి గుండుగొలను వెళుతోంది. గామన్ బ్రిడ్జిపై కొవ్వూరు వైపు వెళ్తుండగా లారీ క్యాబిన్‌లో సెల్ఫ్‌మోటారు నుంచి ఒక్కసారిగా మంటలు వచ్చాయి. డ్రైవరు, క్లీనర్ వెంటనే కిందకు దిగిపోవడంతో పెనుప్రమాదం తప్పింది. సమాచారం అందుకున్న బొమ్మూరు పోలీసులు అగ్నిమాపక కేంద్రానికి తెలపడంతో ఫైర్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు.

డివైడర్‌ను ఢీకొని యువకుడి మృతి



కుతూష్ (ఫైల్‌ఫొటో)

కొవ్వూరు, ఏప్రిల్ 1: ప్రమాదవశాత్తు డివైడర్‌ను ఢీకొని యువకుడు మృతి చెందిన సంఘటన కొవ్వూరు నేషనల్ హైవేపై జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. చాగల్లుకు చెందిన షేక్ అబ్దుల్ కుతూష్(22) నల్లజర్లలో కళ్లజోళ్ల షాపులో పనిచేస్తున్నాడు. సోమవారం పని ముగించుకుని యాక్టివా మోటారుసైకిల్‌పై రాజమహేంద్రవరం బయలుదేరాడు. జాతీయ రహదారిపై మార్గమధ్యలో కొవ్వూరు ఏషియన్ పెయింట్స్ గొడౌన్ వద్దకు చేరుకునే సరికి ఎదురుగా ఉన్న డివైడర్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో కుతూష్ తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. దీనిపై కేసునమోదు చేసినట్టు కొవ్వూరు పట్టణ ఎస్ఐ జుబేర్ మహమ్మద్ తెలిపారు.

సినిమా గైడ్

కొవ్వూరు

యువరాజ్‌మాల్ వై.స్క్రీన్1	కింగ్ ఆఫ్ గాడ్జిల్లా
వై.స్క్రీన్2	ప్రేమలు
దేవిశ్రీ(గాయత్రి)	ఓం బీం బుష్
అనన్య	డీజే టిల్లు-2

నిడదవోలు

వీ మ్యాక్స్	ప్రేమలు
రాధాకృష్ణ	భీమా
శ్రీగణపతి	ఓం బీం బుష్

దేవరపల్లి

శ్రీరామ్ సినీ మ్యాక్స్	గామి
శ్రీరామ్ సినీ మ్యాక్స్	భీమా

నల్లజర్ల

శ్రీలక్ష్మి మల్టీప్లెక్స్ స్క్రీన్1	భీమా
స్క్రీన్ 2	ప్రేమలు
శ్రీనివాస	గామి